www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | అనంతపురం సిటీ**

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్: వెంకటగిరిలోని భారత చేనేత పరిశోధనా సంస్థలో డిప్లొమా కోర్సు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి రమేష్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐ పాసైన విద్యార్థులకు నేరుగా సెకండియర్‌లో ప్రవేశం కల్పిస్తారన్నారు. విద్యార్థుల వయసు 15 నుంచి 23 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయోపరిమితి 25 సంవత్సరాలు అన్నారు. జూన్ 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. వివరాలకు 08625-295003, 9399936872, 98661 69908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.



ఒకే వేదికపైకి

అగ్రనేతలు

ధర్మవరంలో బహిరంగ సభకు హాజరు

పెద్దఎత్తున తరలిరానున్న జనం

ముస్తాబవుతున్న సభావేదిక

నేడే బాబు.. అమిత్ షో

పుట్టపర్తి, మే4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జతకట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారంలో ఒకే వేదికపై అగ్రనేతలు పాల్గొంటున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సంయుక్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. కూటమి ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ తరపున ఆదివారం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించనున్నారు. ధర్మవరంలో నిర్వహించనున్న సభలో వీరు పాల్గొననున్నారు. అమిత్ షా, చంద్రబాబు హాజరవుతుండడంతో సభపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. దీంతో అందరూ ధర్మవరం సభవైపు చూస్తున్నారు. భారీ సంఖ్యలో కూటమి పార్టీల శ్రేణులు, జనం హాజరుకానున్నారు. వెరసి అన్నిదారులు ధర్మవరంవైపే వెళ్లనున్నాయి.

అందరి దృష్టి.. ధర్మవరంపైనే..

టీడీపీ, బీజేపీ, జనసేన మధ్య పొత్తు కుదిరిన తరువాత మార్చి 17 పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో తొలిసారిగా ప్రజాగళం పేరుతో కూటమి సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన హోంమంత్రి అమిత్‌షా ధర్మవరానికి వస్తుండడం, ఇదే సభకు చంద్రబాబు హాజరవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టి ధర్మవరం సభపై మళ్లింది. చరిత్రలో నిలిచిపోయేలా సభ నిర్వహించేందుకు ధర్మవరం-బత్తలపల్లి రహదారిలోని సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్ వద్ద ఏర్పాట్లు సిద్ధం చేశారు.

భారీ ఏర్పాట్లు

ధర్మవరం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సభ నేపథ్యంలో పట్టణంలో కూటమి పార్టీలు భారీ ఏర్పాట్లు చేపట్టాయి. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. సీఎన్‌బీ కల్యాణ మండపం వెనుక వైపున భారీ బహిరంగ సభను సిద్ధం చేశారు. అమిత్ షా బెంగళూరు నుంచి ఉదయం 9.45 గంటలకు బయలుదేరి 10.20కి ధర్మవరం హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి 11గంటలకు బహిరంగ సభావేదిక వద్దకు చేరుకుని, ప్రసంగిస్తారు. 12.30 గంటలకు తిరిగి బెంగళూరుకు చేరుకోవడంతో అమిత్ షా జిల్లా పర్యటన ముగుస్తుంది. వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలిరానున్నారు.

కూటమి శ్రేణుల్లో ఉత్సాహం

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో జోష్ మీదున్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరం సభావేదికపై చంద్రబాబు, అమిత్ షా ఇచ్చే సందేశం మరింత ఉత్సాహం నింపనుందనడంలో సందేహం లేదు. ఉమ్మడి జిల్లాల కూటమి పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ ఉమ్మడి జిల్లాలో పలు సభల్లో పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఉమ్మడిగా ప్రచారం జోరుగా సాగిస్తున్నాయి. పొత్తులో భాగంగా ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్‌యాదవ్‌ను బరిలో దింపారు. ఆయన తరపున ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన అమిత్‌షా ఆదివారం రానున్నారు. సభకు అంచనాలకు మించి కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలు హాజరవుతారని భావిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు కూటమి శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. సభను విజయవంతం చేయాలని హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి, ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ కోరారు.



సభావేదిక వద్ద ఏర్పాట్లు

చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఇలా...

ఉదయం 8.25 గంటలకు: రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరతారు

9.45గంటలకు: పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు

9.55 గంటలకు: సత్యసాయి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయల్దేరతారు

10.15 గంటలకు: ధర్మవరంలోని బత్తలపల్లి రోడ్డు పక్కన శివాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు

11.00 నుంచి 12.00 గంటల వరకు: సీఎన్‌బీ కల్యాణమండపం వెనుకభాగాన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.

1.00 నుంచి 2.00 గంటల వరకు: భోజన విరామం

2.00 గంటలకు: హెలీప్యాడ్ నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లా కురుబలకోట, అంగళ్ల సభకు వెళ్లనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

అమిత్ షా, చంద్రబాబునాయుడు బహిరంగ సభావేదిక ఏర్పాట్లను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కోవెలమూడి రవీంద్ర, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, శేఖర్ తదితరులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. అమిత్‌షా, చంద్రబాబు బహిరంగ సభకు ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, కూటమి నేతలు


రేపే ఏపీ ఐసెట్

అనంతపురం సెంట్రల్, మే 4: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకోసం ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను (ఐసెట్-2024) సోమవారం నిర్వహిస్తామని సెట్ ఛైర్మన్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి శనివారం తెలిపారు. సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మురళీక్రిష్ణతో కలిసి ఐసెట్ నిర్వహణ గురించి ఎస్కేయూలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 6 నుంచి ఏప్రిల్ 27వరకు ఆన్‌లైన్ ద్వారా ఐసెట్‌కు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఏపీ, తెలంగాణ నుంచి 48,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 పట్టణాలతోపాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో కలిపి మొత్తం 113 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టిక్కెట్ మినహా ఎలాంటి పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు.

బీజేపీ నాయకులపై దాడి..

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై కేసు

కూటమి అభ్యర్థి సత్యకుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



ధర్మవరం, మే 4: పట్టణంలో శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులపై దాడికి సంబంధించి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ కార్యకర్త గోపాల్‌నాయక్ ఫిర్యాదు మేరకు కూటమి అభ్యర్థి సత్యకుమార్, మరొకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. బీజేపీ నాయకులు భాను, శ్రీనివాసులుపై మున్సిపల్ కార్యాలయ సమీపంలోని కేఫ్ వద్ద అధికార పార్టీకి చెందిన కొందరు శుక్రవారం రాత్రి దాడిచేసి, తీవ్రంగా గాయపరచిన సంగతి తెలిసిందే. బాధితులు భాను, శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డితోపాటు వైసీపీ నాయకులు మారుతి, వినయ్‌గౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదే ప్రదేశంలో ప్రచారంలో ఉన్న తనపై బీజేపీ వర్గీయులు రాళ్లు రువ్వారంటూ వైసీపీ నాయకుడు గోపాల్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, నాయకుడు డోలా రాజారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 27.0	42.0 28.0	41.0 28.0	42.0 28.0	41.0 27.0

ఉద్యోగులపై ప్రభుత్వం కుట్ర

గందరగోళంగా పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల సిబ్బందికి అవస్థలు

పోలింగ్ శాతం తగ్గే ప్రమాదం





కదిరిలో బ్యాలెట్ ఓటు కోసం నిరసన తెలుపుతున్న ఎన్నికల సిబ్బంది

ధర్మవరం, మే 4: ఉద్యోగుల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వం వారిపై అడుగడుగునా కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఇచ్చే పోస్టల్ బ్యాలెట్ విషయంలో కుయుక్తులు పన్నుతోంది. దీంతో ఉద్యోగులు బ్యాలెట్ ఓటు కోసం తంటాలు పడుతున్నారు. ఎలాగైనా ఉద్యోగుల ఓటింగ్ శాతాన్ని తగ్గించాలనే ప్రభుత్వం కుట్రలు పన్నుతుందోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన పీఓ, ఏపీఓలు ఇతరత్రా సిబ్బందికి ధర్మవరం పట్టణంలోని షిర్డిసాయిబాబా కల్యాణమండపంలో శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలోనే వారందరికీ బ్యాలెట్ ఓటు ఇవ్వాలి. ఉద్యోగి విధులు నిర్వహించే ప్రాంతంతో సంబంధం లేకుండా ఎన్నికల విధుల చోటే అవకాశం కల్పించాలన్న మాట. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంది. బ్యాలెట్ ఓటు కోసం ఫారం-12 సమర్పించిన ప్రాంతంలో పోలింగ్ జాబితాలో పేర్లు నమోదు కాలేదు. బ్యాలెట్ ఓటు కోసం వెళ్లిన సిబ్బంది.. జాబితాలో పేరు లేకపోవడంతో షాక్‌కు లోనవుతున్నారు. కనీసం సమాధానం చెప్పేవారు కరువయ్యారు. దీంతో బ్యాలెట్ ఓటు కోసం ఎన్నికల సిబ్బంది ఆందోళనకు దిగుతున్నారు. జిల్లాలో చాలామంది ఉద్యోగులకు ఇదే సమస్య తలెత్తింది. దీంతో బ్యాలెట్ ఓటింగ్ శాతం భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇదంతా వైసీపీ ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగమేనని పలువురు ఉద్యోగులు మండిపడుతున్నారు.

కదిరిలో నిరసన

కదిరి: పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల ధోరణికి నిరసనగా ఎన్నికల సిబ్బంది ఆందోళనకు దిగారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 50 మందికిపైగా అధికారులు తాము అంతర్ జిల్లాకు చెందినవారమనీ, శిక్షణాకేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని శనివారం వచ్చారు. సాయంత్రం 6 గంటలైనా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చామనీ, సాయంత్రం వరకు వేచిచూసినా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. మహిళా సిబ్బంది రాత్రి ఇళ్లకు ఎలా చేరుకోవాలని మండిపడ్డారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికల సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 350 మందికిగాను 321 మంది శిక్షణకు హాజరయ్యారు. 190 మంది జిల్లాకు చెందిన సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలినవారికి సాయంత్రమైనా బ్యాలెట్ పత్రాలు రాలేదు. ఎన్నిమార్లు అడిగినా.. వస్తాయని సమాధానం చెబుతున్నారే తప్ప.. ఇవ్వట్లేదంటూ వారు నిరసన వ్యక్తం చేశారు.

అందరికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం

కలెక్టర్ అరుణ్‌బాబు



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, మే 4: జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామనీ, ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీ జానకిరామయ్య స్కూల్‌లో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కొంతమందికి ఎన్నికల విధుల ఉత్తర్వులు ఆలస్యంగా చేరడంతో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేకపోయారన్నారు. వారికి సోమవారం పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల విధుల్లో అంతర్ జిల్లా సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తామన్నారు. రెండో విడత శిక్షణకు హాజరైన 250 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇందులో నియోజకవర్గాల వారీగా మడకశిర 10, హిందూపురం 64, పెనుకొండ 54, పుట్టపర్తి 55, ధర్మవరం 26, కదిరి 41 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ భాగ్యరేఖ, ఏఆర్‌ఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

హిందూపురం అష్టదిగ్బంధనం

గంట రోడ్‌షోకి.. 10గంటలు ఆంక్షలు

- దుకాణాలు బంద్
- వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు
- ఎండకు జనం విలవిల
- విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఉక్కపోతతో పట్టణవాసుల అవస్థలు
- పురం అభివృద్ధిపై నోరు మెదపని సీఎం జగన్
- జనం రాకపోవడంతో స్థానిక నాయకులకు చురకలు



ఇటు.. జనం పరార్..



అటు.. సీఎం ప్రసంగం..

జగన్ వచ్చాడు.. నరకం చూపాడు..!

హిందూపురం/హిందూపురం అర్బన్, మే 4: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శనివారం పట్టణానికొచ్చాడు. ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపాడు. సీఎం రోడ్‌షో, సభ ఉండడంతో ఏకంగా పట్టణాన్ని అష్టదిగ్బంధనం చేశారు. పట్టణం నుంచి ఎవరూ బయటకు వెళ్లడానికి వీల్లేకుండా చేశారు. పట్టణంలో ఉందామంటే దుకాణాలు బంద్ చేయించారు. తీవ్ర ఎండలో దాహమేస్తే తాగడానికి నీరు కూడా దొరక్కుండా చేశారు. విద్యుత్ సరఫరా ఆపేశారు. గంటల తరబడి విద్యుత్ సరఫరా లేక జనం ఇళ్లలో ఉక్కపోతతో విలవిల్లాడారు. చిన్నపిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. పట్టణాన్ని దిగ్బంధించి, దుకాణాలు బంద్ చేయించి, విద్యుత్ సరఫరా ఆపేసి ప్రజలకు నరకం చూపించారు. పట్టణంలో సీఎం జగన్మోహన్ రెడ్డి ఉదయం 11 గంటలకు రోడ్ షో, తరువాత అంబేడ్కర్ సర్కిల్‌లో మధ్యాహ్నం 12.47కి సభ నిర్వహించారు. ట్రాన్స్‌కో అధికారులు ఉదయం 9 గంటలకే విద్యుత్ సరఫరా ఆపేశారు. దీంతో ఇళ్లలో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు నరకయాతన అనుభవించారు. ఒంటిగంట వరకు సరఫరా రాకపోవడంతో విలవిల్లాడారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా ఆపేయడం ఏంటని ఆగ్రహించారు. విద్యుత్ శాఖ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆఖరుకు సీఎం పర్యటకు విధులకు వచ్చిన పోలీసులకు కూడా నీరు దొరక్క దాహార్తితో సతమతమయ్యారు.

వ్యాపార సముదాయాలు బంద్

సీఎం నగన్ రావడంతో పట్టణ నలుమూలలా వ్యాపార సముదాయాలు బంద్ చేయించారు. హోటళ్లు, దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు అన్నింటినీ మూసి వేయించారు. దీంతో వేసవి తాపం తీర్చుకోవడానికి కనీసం నీరు కూడా దొరక్క జనం విలవిల్లాడారు. ఇతర పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన వారు తిండి, నీరు దొరక్క ఇబ్బందులు పడ్డారు. వాహన రాకపోకలను బంద్ చేయడంతో పనుల నిమిత్తం పట్టణానికి వచ్చినవారు తిరిగి వెళ్లే అవకాశం లేక ఎండలో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. వాహనాలను ఎక్కడికక్కడ పోలీసులు కట్టడి చేశారు. దీంతో నడుచుకుని ఆస్పత్రికి చేరాల్సి వచ్చిందని ఆగ్రహించారు. ఎండలో ఇవేం తిప్పలని విరుచుకుపడ్డారు.



పెనుకొండ రహదారిలో మూతపడ్డ దుకాణాలు

చెట్లకింద, దుకాణాల వద్ద..

అధికారం ఉండడంతో నయానో, భయానో.. సీఎం సభకు జనాలను తరలించారు. సభకు వచ్చిన జనం ఎండ తీవ్రతను భరించలేక ఆస్పత్రి ప్రాంగణంలో, చెట్లకింద సేదతీరుతూ కనిపించారు. జగన్ ప్రసంగం వినకుండానే వెనుదిరిగి పోయారు. జగన్ మాట్లాడటానికి ముందే ఒక్కొక్కరుగా జారుకున్నారు. గంట రోడ్‌షోకు పది గంటల పాటు పట్టణవాసులు అవస్థలు పడ్డారు. ముఖ్యమంత్రి వస్తే ఇంత ఇబ్బందులు ఏంటని అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతంలో నివాసమున్నవారు ప్రశ్నించారు. షెడ్యూల్ కన్నా గంట ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రోడ్‌షోలో జగన్ మాట్లాడటానికి మునుపే జనం ఒక్కొక్కరే వెళ్లిపోయారు. జగన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల గురించి చెబుతుంటే ఒక్కరు కూడా స్పందించలేదు. కొత్తగా ఏమైనా హామీలు ఇస్తారేమోనని ఎదురుచూశారు. హిందూపురం అభివృద్ధిపై నోరు మెదపకపోవడంతో ఉసూరుమన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హిందూపురంలోకి వచ్చే పెనుకొండ రహదారి మినహా మిగిలిన దారులన్నింటినీ దిగ్బంధించారు. ఆఖరికి ప్రభుత్వ ఆసుపత్రి ఒకవైపు గేటుకు, పోలీస్‌స్టేషన్ల వద్ద కూడా బారికేడ్లు కట్టారు. ముక్కడిపేటలో వీధులకు బారికేడ్లు అడ్డం పెట్టించి, జనం ఇళ్లలోంచి రాకుండా పోలీసులు కాపలా కాశారు. ముఖ్యమంత్రి సభ 12గంటలకు ప్రారంభమైనా వేకువ జాము నుంచే తోపుడు బండ్లు, కూరగాయలు, పూల వ్యాపారులు రానీయకుండా చేశారు.

ప్రసంగం చప్పగా..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శనివారం ఉదయం 10.25కు ఎంజీఎం క్రీడా మైదానంలో హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని 12.10 గంటలకు ప్రసంగం ప్రారంభించారు. 37 నిమిషాల పాటు ప్రసంగించారు. ప్రజలను ఆకట్టుకునేవిధంగా హామీలు కానీ, కొత్తగా ఏమీ ప్రకటించలేదు. పాత పథకాలనే స్తుతిస్తుంటే అది వినలేక జనం వెనుతిరిగిపోయారు. ఈ రోడ్‌షోకు హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల నుంచి జనం వచ్చారు. ఈ మూడు నియోజకవర్గాల అభివృద్ధిపై సీఎం ఒక్కమాటైనా మాట్లాడలేదు. చేపట్టబోయే పథకాల గురించి చెప్పలేదు. దీంతో వచ్చిన జనం తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ప్రసంగిస్తున్న సమయంలో హిందూపురం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పక్కనే పెనుకొండ, మడకశిర అభ్యర్థులున్నా వారిని గెలిపించాలని ఒక్కమాటైనా అడగలేదు. ఆ నియోజకవర్గాల్లోని జనం మాత్రం పాల్గొన్నారు. దీంతో వారు నిరాశ వ్యక్తం చేసినట్లు సమాచారం. లక్షలు ఖర్చుపెట్టి జనాన్ని తరలిస్తే ముఖ్యమంత్రి ఒక్కమాటైనా చెప్పకపోవడం ఏంటని ఆ నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు మండిపడ్డారు.

అనుకున్నంత జనం రాకపోవడంతో...

మూడు నియోజకవర్గాల నుంచి సుమారు 50వేల మంది వస్తారని నాయకులు అంచనా వేశారు. రోడ్‌షోకు హాజరైంది మాత్రం 7 వేల మందే. జనం రాకపోవడంతో స్థానిక నాయకులకు ముఖ్యనేతలు చీవాట్లు పెట్టినట్లు కొంతమంది అధికార పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు. ప్రతి పంచాయతీకి 50వేల నుంచి 90వేల దాకా నగదు అందజేసి, రవాణా సౌకర్యం కల్పించి భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. హిందూపురంలో ప్రతి వార్డుకు రూ.60వేలు చొప్పున అందజేసినా అనుకున్నంత జనం రాలేదని నాయకులు మండిపడ్డారు. పట్టణంలో ఆశించిన దానిలో పదిశాతం మంది కూడా రాకపోవడం ఏంటని ముఖ్యనేతలే మదనపడ్డారు. మైనార్టీ వార్డుల నుంచి జనాన్ని తరలించడంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు విఫలమయ్యారని ముఖ్యనేత ఒకరు క్లాస్ పీకినట్లు తెలిసింది. మహిళలు తక్కువగా రావడం ఏంటని ఆరాతీశారు. డబ్బు తీసుకెళ్లి కొంతమంది జనం తరలించడంలో నిర్లక్ష్యం వహించినట్లు ముఖ్యనేతలు భావిస్తున్నారు.



ప్రభుత్వాస్పత్రిలో చెట్ల కింద సేదతీరుతున్న జనం



రోడ్‌షోకి వచ్చిన జనం మద్యం దుకాణం వద్ద ఇలా..

నేడు ధర్మవరానికి అమిత్‌షా, చంద్రబాబు



బహిరంగ సభలో పాల్గొననున్న అగ్రనేతలు


భారీ ఏర్పాట్లు

ధర్మవరం, మే 4: ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదివారం ధర్మవరం విచ్చేస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగిస్తారు. ధర్మవరంలోని సీఎన్‌బీ కల్యాణ మండపం వెనుక భాగాన బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11.00 గంటలకు బహిరంగ సభ వేదిక వద్దకు అమిత్ షా, చంద్రబాబు చేరుకుని, ప్రసంగించనున్నారు. పెద్దసంఖ్యలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు తరలిరానున్నారు. అందుకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు చేపట్టారు. పట్టణం మొత్తం కాషాయ, పసుపు జెండాలతో నిండిపోయింది.





ముస్తాబవుతున్న సభావేదిక





ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థినులు

యాంత్రీకరణకు జగన్ పాతర..!

- ఐదేళ్లల్లో నామమాత్రంగా సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్ల మంజూరు
- రైతులకు అందని యంత్రపరికరాలు
- తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, ఇతర పరికరాలకు మంగళం
- 'డ్రోన్' యంత్రాల ఊసేలేదు
- వైసీపీ పాలనలో సబ్సిడీకి దూరమైన రైతులు



యంత్రసేవ పథకం ద్వారా రైతు గ్రూపులకు అందించిన ట్రాక్టర్లు (ఫైల్)

అనంతపురం అర్బన్/ యాడికి: కరువు రైతులకు సబ్సిడీతో యంత్రపరికరాలు అందించే పథకాలకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మంగళం పాడారు. మరీ ముఖ్యంగా రైతులకు వ్యక్తిగతంగా సబ్సిడీతో యంత్ర పరికరాలు సరఫరా చేయలేదు. టీడీపీ హయాంలో గ్రూపులతోపాటు రైతులకు వ్యక్తిగతంగా రైతు రథం ట్రాక్టర్లు, పలు రకాల యంత్ర పరికరాలు అందజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే యాంత్రీకరణ పథకాలను అటకెక్కించింది. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో నమ్మి ఓట్లు వేసి గద్దెనెక్కించారు. అధికారంలోకి రాగానే మెరుగైన పథకాలతో తమను ఆదుకుంటారని కరువు రైతులు భావించారు. వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. నూతనంగా యాంత్రీకరణ పథకాలను అమలు చేయకపోగా టీడీపీ హయాంలోని పథకాలన్నీ రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనపై కరువు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




యంత్ర పరికరాలు (ఫైల్)

పరికరాల పంపిణీ నిలిపివేత

వైసీపీ పాలనలో రైతులకు వ్యక్తిగతంగా యంత్రీకరణ పరికరాలు మంజూరు చేయడాన్ని ఆపేశారు. టీడీపీ హయాంలో రైతులకు వ్యక్తిగతంగా 40 నుంచి 50 శాతం సబ్సిడీతో ట్రాక్టర్ పరికరాలు, తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, పీయూసీ, ఇతర పరికరాలు పంపిణీ చేసి చేయూతనిచ్చారు. రైతు రథం పేరుతో రైతులకు వ్యక్తిగతంగా ట్రాక్టర్లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 2500 మందికిపైగా రైతులకు వ్యక్తిగతంగా రైతు రథం ట్రాక్టర్లు అందజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆయా పథకాలన్నీ పూర్తిగా రద్దు చేశారు. ఐదేళ్లల్లో ఏ ఒక్క రైతుకు వ్యక్తిగతంగా యంత్రీకరణ పరికరాలు మంజూరు చేయలేదు. దీంతో కరువు రైతులు సబ్సిడీకి దూరమయ్యారు. తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో ట్రాక్టర్, ఇతర రకాల పరికరాలు అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. తద్వారా ఆర్థిక భారం పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అరకొరగా సీహెచ్‌సీ గ్రూపులకు మంజూరు

జిల్లా వ్యాప్తంగా 451 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత యంత్రసేవ పథకం ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)కు ట్రాక్టర్, ఇతర యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేశారు. ఐదేళ్లల్లో కేవలం 448 ఆర్బీకేల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున సీహెచ్‌సీ సెంటర్లకు ట్రాక్టర్, పరికరాలు పంపిణీ చేయడంతో సరిపెట్టారు. అందులోనూ స్థానిక అధికార పార్టీ నేతలు చెప్పిన గ్రూపులకే పథకాన్ని వర్తింపజేసి మిగతా రైతులకు మొండి చేయి చూపారు. సీహెచ్‌సీ సెంటర్లకు అరకొరగా ట్రాక్టర్, పరికరాలు అందజేసి రైతులను తామే ఉద్ధరించినట్లు వైసీపీ పాలకులు ఆర్భాటంగా చెప్పుకోవడం విమర్శలకు తావిస్తోంది.



డ్రోన్ ద్వారా పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

'డ్రోన్ల'పై చేతులెత్తేశారు..

అన్ని రకాల పురుగు మందుల పిచికారి చేసేందుకు సబ్సిడీతో డ్రోన్ యంత్రాలను పంపిణీ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి చేతులెత్తేసింది. పదోతరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారి రైతుల గ్రూపులకు 40 శాతం సబ్సిడీ, వ్యవసాయ వృత్తి కోర్సులు పూర్తి చేసిన వ్యక్తి ఉన్న రైతు గ్రూపులకు రూ.50 శాతం సబ్సిడీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల క్రితం డ్రోన్లు మంజూరుకు సంబంధించి రైతు గ్రూపులు, పైలెట్‌గా ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండేళ్ల క్రితం జిల్లాకు తొలి విడతలో 93 డ్రోన్లు కేటాయించారు. ఆ తర్వాత జిల్లాలోని ఒక్కో మండలానికి ఒక్క డ్రోన్ చొప్పున 31 డ్రోన్లను కేటాయించారు. ఒక్క డ్రోన్ యంత్రాన్ని కూడా రైతు గ్రూపులకు అందజేయకపోయారు. దీంతో ఆయా రైతు గ్రూపు సభ్యులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

వైసీపీ హయాంలో పరికరాలు ఇవ్వలేదు

- నాగిరెడ్డి, రైతు, చిక్కేపల్లి, యాడికి మండలం



వైసీపీ హయాంలో వ్యక్తిగతంగా ఏ ఒక్క రైతుకు యంత్రీకరణ పరికరాలు ఇవ్వలేదు. గత ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో మద్దతునిచ్చాం. రైతుల ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి పథకాలు అమలు చేయకుండా తీరని అన్యాయం చేశారు. కేవలం కొన్ని సీహెచ్‌సీ సెంటర్లకు ట్రాక్టర్, పరికరాలు మంజూరు చేశారు. అందులోనూ వైసీపీ నాయకులు చెప్పిన గ్రూపులకే కేటాయించారు. ఏవైనా యంత్ర పరికరాలు కావాలంటే బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు.

టీడీపీ హయాంలో సబ్సిడీలతో చేయూత

- ఆదిరెడ్డి, రైతు, వీరారెడ్డిపల్లి, యాడికి మండలం



టీడీపీ హయాంలో పలు రకాల సబ్సిడీ పథకాలతో రైతులకు చేయూతనిచ్చారు. అప్పట్లో రైతులకు వ్యక్తిగతంగా రైతు రథం పథకం ద్వారా సబ్సిడీతో ట్రాక్టర్లు పంపిణీ చేశారు. తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, పీయూసీ పైపులు, ట్రాక్టర్ పరికరాలను 40 నుంచి 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేశారు. వైసీపీ వచ్చినప్పటి నుంచి పాత పథకాలన్నీ రద్దు చేశారు. జగన్ రైతులను ఉద్ధరిస్తాడని ఆశపడితే ఎలాంటి పథకాలు అమలు చేయకుండా మోసం చేశాడు. సబ్సిడీతో యంత్ర పరికరాలు ఇవ్వకుండా కరువు రైతులపై ఆర్థిక భారాన్ని మోపారు. రైతులకు డ్రోన్లు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఒక్కటి కూడా ఇవ్వలేదు.

జగన్ దెబ్బకు పీజీ పరేషాన్..!

అనంతపురం సెంట్రల్: అమ్మా, అక్కా మీ పిల్లలను కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివిస్తానని ప్రతిపక్ష నేతగా ఎన్నికల్లో చెప్పిన జగన్‌రెడ్డి.. గద్దెనెక్కగానే ప్లేటు ఫిరాయించారు. పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌పై కొర్రీలుపెట్టి ప్రైవేట్ కళాశాలల్లో చదివేవారికి ఇచ్చేదిలేదని పథకాన్ని ఎత్తివేశారు. ఉచితంగా చదివిస్తామంటే ఓట్లువేసి గెలిపించినందుకు తమ పిల్లల భవిష్యత్తును కాలరాశాడని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌ను రద్దుచేయడంతో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ సీట్లు ఖాళీ అయ్యాయి. ప్రవేశాలు ఆరు శాతానికి పడిపోయాయని కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తొమ్మిది, ఎంటెక్ 80, ఎంబీఏ, ఎంసీఏ 73 మొత్తం 162 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాకింద 16,737 సీట్లను కేటాయించగా 1064 మంది విద్యార్థులు మాత్రమే చేరారని, దీంతో ప్రవేశాల శాతం 6గా నమోదైందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు పొందిన ప్రతి విద్యార్థికి టీడీపీ హయాంలో ప్రభుత్వమే కళాశాలల ఫీజులు చెల్లించిందని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దుచేసినప్పటి నుంచి పీజీ చదవడానికి విద్యార్థులు ముందుకు రావడంలేదని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూటమి సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తామని, ఫీజు మొత్తాలను నేరుగా కళాశాలలకే చెల్లిస్తామని హామీనిచ్చారు. దీంతో పీజీ కోర్సులకు పూర్వవైభవం సంతరించుకుంటుదని విద్యార్థులు, కళాశాలల యాజమానులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నా.. నా.. అంటూనే..

'నా పేదలు, నా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ'లు అంటూనే తేనెపూసిన కత్తిలాంటి మాటలతో వల్లెవేస్తున్నారని, నిజానికి ఆయా వర్గాల పేదలు పీజీ చేసి ఉద్యోగాలు చేయడం జగన్‌కు ఇష్టంలేక కక్షపూరితంగానే ఫీజురీయింబర్స్‌ను ఎత్తివేశాడని విద్యార్థులు మండిపడుతున్నారు. జగన్ నా అనిచెప్పుకునే వర్గాల విద్యార్థులే ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమతలేక డిగ్రీలకే పరిమితమై నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. డిగ్రీలో చదివిన సబ్జెక్టుల్లోని ఏదేని ఒకదానిపై పీజీలు, పరిశోధనలు చేయడం, ప్రొఫెషనల్ కోర్సులైన ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ ద్వారా ప్రాజెక్టులు చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వారు చెబుతున్నారు.

సొంతంగా ఫీజులు కడుతున్నాం: పీజీ విద్యార్థులు

వైసీపీ అధికారం చేపట్టాక ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేశారు. ఎన్నికల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివిస్తానని హామీనిచ్చాడు. సీఎం కాగానే ప్లేటు ఫిరాయించి పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేశాడు. దీంతో కళాశాలలకు సొంతంగా ఫీజులు కడుతున్నాం. పీజీ పూర్తిచేస్తే ఏదైనా ఉద్యోగం లభిస్తుందని తద్వారా తల్లిదండ్రులకు ఆసరగా నిలబడాలన్న తపనతో ఫీజులు కట్టి చదువుతున్నాం.

కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ఉత్తిదే..
పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు
భారీగా పడిపోయిన ప్రవేశాలు
పునరుద్ధరణకు చంద్రబాబు హామీ

జగన్‌ను సాగనంపాలి

బాలకృష్ణ, నగర కన్వీనర్, ఏఐఎస్ఏ



ఉచితంగా చదివిస్తానని హామీనిచ్చిన జగన్.. అధికారంలోకివచ్చి పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేశారు. దీంతో జగన్‌ను గద్దెదింపి ఇంటికి సాగనంపేందుకు బాధిత విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇటు పేద విద్యార్థులు, అటు ప్రైవేట్ కళాశాలలు రోడ్డున పడ్డాయి.

పేదలపై కక్షగట్టిన జగన్:


బండారు శంకర్, జిల్లా కోశాధికారి, పీడీఎస్‌యూ



వేలాది కోట్లకు అధిపతి అయిన జగన్‌రెడ్డి పేదలపై కక్షకట్టారు. కన్వీనర్ కోటా ద్వారా ఉన్నత విద్యా ప్రవేశాలు పొందిన ప్రతి విద్యార్థికి ఫీజులు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అందుకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరించింది. ఒక్కో కోర్సు పూర్తిచేయాలంటే రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజులు చెల్లించాలి. ఉన్నత విద్యనందించి తమ జీవితాలను మెరుగు పరుచుకోవాలని విద్యార్థులు ఆకాంక్షించారు. వారి ఆశలను జగన్ గల్లంతుచేశారు.

మా భూములపై జగన్ పెత్తనమేంటి..?

- మా కష్టార్జితాన్ని హరించే హక్కు ఎవరిచ్చారు..?
- జగన్ తీరుపై రైతుల ఆగ్రహం
- ల్యాండ్ టైటిల్ చట్టంపై ఆందోళన
- ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్న చంద్రబాబు
- చంద్రబాబుతోనే జతకడతామంటున్న అన్నదాతలు
- జగన్ ముంచేస్తున్నాడని వైసీపీ అభ్యర్థుల ఆవేదన



అనంతపురం, మే 4(ఆంధ్రజ్యోతి): 'అదేందో ల్యాండ్ టైటిలింగ్ యాక్టంటప్పా..! ఆ చట్టంతో మన భూములు ఇకనుంచి మనవి కాదంట..! ఇదేం చట్టమప్పా..?' అనే చర్చ జిల్లా రైతాంగంలో జోరుగా సాగుతోంది. ఏ గ్రామంలో చూసినా, ఏ ఇద్దరు రైతులు కలిసినా ఈ చట్టం గురించే మాట్లాడుకుంటున్నారు. రచ్చబండ, టీ స్టాల్స్ బీడీల అంగడి.. ఇలా ఎక్కడ చూసినా ఈ చట్టం గురించే చర్చించుకుంటున్నారు. 'ఏదో రాజశేఖర్‌రెడ్డి కొడుకు కదా... ఆయనలాగే రైతులకు మంచి చేస్తారని నమ్మి ఓట్లేసి ముఖ్యమంత్రిని చేస్తే.. రైతులను నిండా ముంచేందుకు తయారైనట్లున్నాడు. ఐదేళ్లు అధికారంలో ఉన్నా జిల్లాలో ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు. ఒక కాలువ తవ్వలేదు. అదేమంటే ఏటా పెట్టుబడి సాగు కింద రూ.13,500 ఇస్తున్నా కదా అని చెప్పుకుంటున్నాడు. తీరా చూస్తే ఈయనిచ్చేదేమో రూ.7,500. అదికూడా రెండుసార్లు ఇస్తున్నాడు. మిగిలిన రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. రైతులను ఆదుకుంటానని జిల్లాకొచ్చిన ప్రతిసారీ చెబుతాడు. రైతు భరోసా తప్ప రైతును ఆదుకునేందుకు ఏమీ చేయలేదప్పా' అని అన్నదాతలు జగన్ పాలనపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు పెట్టాడు గాని, అందులో అవసరానికి అనుగుణంగా మందులు, ఎరువులు ఉండవని అంటున్నారు. 'వ్యవసాయాన్ని నమ్ముకుని ఇప్పటికే నిండా మునిగిపోయాం. అప్పులపాలయ్యాం. ఏదో భూములున్నాయి కదా... అని బతుకు వెళ్లదీస్తున్నాం. రైతును రాజు చేస్తామని ప్రసంగాల్లో గొప్పగొప్ప మాటలు చెప్పారేగాని.. చేసిందేమీ లేదు. మా మానాన మేము బతుకుతుంటే.. మా భూములు మావి కాదనే విధంగా ఈ చట్టమేందప్పా..?' అని జిల్లా రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. రైతులను ఆదుకునేందుకు చట్టాలు చేయాలిగాని.. రైతులను మరింత ఇబ్బంది పెట్టే చట్టాలు ఎవరు చేసినా తప్పేనని ఆ వర్గాలు అంటున్నాయి.

ఆ హక్కు ఎవరిచ్చారు..?

'మా ముత్తాతలు, మా తాతలు, మా తండ్రుల నుంచి సంక్రమించిన భూములతో పాటు మా కష్టార్జితంతో కొన్న భూములు. అవి ఉన్నాయనే ధైర్యంతోనే బతుకుతున్నాం. మా కష్టార్జితాన్ని హరించే హక్కు జగన్‌కు ఎవరిచ్చారు..?' అని రైతులు ప్రశ్నిస్తున్నారు. 'ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రకారం ఒరిజినల్ పత్రాలు మాకీరంట. జిరాక్సులు మాత్రమే ఇస్తారంట. ఈ చట్టం దేశంలో ఎక్కడా లేదు. జగనన్న పాలనలోనే రాష్ట్రంలో ఈ చట్టం అమలవుతోందంట. ఇదెక్కడి న్యాయం..?' అని అన్నదాతలు మండిపడుతున్నారు. ఇదేనా రాజన్న రాజ్యమంటే..? అంటూ ఆ వర్గాలు అక్కసు వెళ్లగక్కుతున్నాయి. 'ఇప్పటికే మాకు హక్కుగా సంక్రమించిన భూముల తాలూకు పాసుబుక్కుల మీద సీఎం జగన్ ఫొటో ముద్రించారు. అయినా నోరు మెదపలేదు. మా భూముల హద్దులు సూచించే సర్వే రాళ్లపైనా జగన్ ఫొటో వేశారు. ఏదో ముఖ్యమంత్రిలే అని పట్టించుకోలేదు. ఇప్పుడేమో ఈ చట్టం ద్వారా మా ఒరిజినల్ పత్రాలీకుండా... జిరాక్స్ ఇస్తాడంట. ఎవరైనా మా భూములు కబ్జా చేస్తే మా ప్రాంతంలో ఉండే కోర్టుకు వెళ్లకూడదంట. ఏకంగా హైకోర్టుకు పోవాలంట. ఇదేమి చట్టం..? ఇదేమి పాలన..? ఎప్పుడూ చూడలేదబ్బా..' అని నిట్టూరుస్తున్నారు. ఎక్కడైనా భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాల్లో రాజముద్ర ఉంటే గౌరవం. రైతులు సంతోషిస్తారు. ప్రతిదాంట్లోనూ జగన్ ఫొటో వేస్తున్నారు. జీవితాంతం ఆయనే సీఎంగా ఉంటారా..? జగన్‌కు, అధికారులకు తెలీదా? అని రైతులు మండిపడుతున్నారు. 'అసలే అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నాం. ఇంట్లో ఏదైనా ఇబ్బందులు తలెత్తినాం, శుభకార్యాలు చేసినా, పిల్లోళ్లను పెద్ద చదువులు చదివించాలనుకున్నా... మా దగ్గర ఉన్న ఆస్తి భూములే. ఆ భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకొని అవసరాలను తీర్చుకునేవాళ్లం. ఈ చట్టంతో జిరాక్స్ కాపీలకు బ్యాంకోళ్లు డబ్బులు ఎందుకు ఇస్తారు..? ఆ మాత్రం ప్రభుత్వం ఆలోచన చేయదా..?' అని రైతుల నుంచి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రాజకీయ విశ్లేషకులు, మేధావివర్గాలు ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వ్యతిరేకిస్తున్నారు.

చంద్రబాబుతోనే మేలు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఇప్పటికే రైతన్నల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి పులివెందులలో ప్రచారానికి వెళితే.. దీనిపై ఓ రైతు నిలదీశారు. తమ భూముల పాసుపుస్తకాలపై జగన్ ఫొటో ఎలా పెడుతారని భారతిని ప్రశ్నించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ సైతం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఎంత ప్రమాదకరమో ప్రచార సభల్లో స్పష్టంగా వివరిస్తున్నారు. ప్రజల భూములపై జగన్ పెత్తనమేమిటని ప్రతి సభలోనూ చంద్రబాబు ఎండగడుతున్నారు. దీనిపై రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఆలోచనలో పడ్డారు. చంద్రబాబుతోనే జతకడితేనే బతుకులు మారుతాయన్న అభిప్రాయానికి వచ్చారు. చంద్రబాబు పాలనలోనే కరువు జిల్లాకు న్యాయం జరిగిందనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది. కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు తీసుకురావడంతో పాటు చెరువులు నింపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీ ఇచ్చి మేలు చేసింది చంద్రబాబే నని నమ్ముతున్నారు. జిల్లా మనవడినంటూ.. ఈ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. జగన్ మోసగించారని, బటన్ నొక్కుడుతోనే సరిపెట్టారని రైతులు మండిపడుతున్నారు.



ఆవేదనలో వైసీపీ అభ్యర్థులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఇప్పుడెందుకు అమలు చేయాల్సి వచ్చిందబ్బా..? ఈ చట్టమే మా కొంప ముంచనుందా..? అని వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఆ పార్టీ వర్గాల్లో ఈ చర్చ జోరుగా సాగుతోంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పకపోవడం, ఇచ్చిన మాట మేరకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో ఆ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. ఈ భయం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది. దీనికి తోడు మహిళలకు కూటమి మేనిఫెస్టోలో పెద్దపీట వేయడం, పెద్ద ఎత్తున ఆర్థిక చేయూతనందిస్తుండటం వైసీపీ అభ్యర్థులను అభద్రతాభావంలోకి నెట్టాయి. ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న భయం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది.

మైనార్టీలను మభ్యపెట్టాలని జగన్ ఎత్తుగడ

టీడీపీ ఉన్నంతవరకూ ముస్లింలకు భయం లేదు

జగన్ మోసపూరిత మాటలను మైనార్టీలు నమ్మొద్దు

శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

అనంతపురం రూరల్, మే 4: ముస్లిం మైనార్టీలను సీఎం జగన్ మభ్యపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మండిపడ్డారు. కక్కలపల్లి క్రాస్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో రాప్తాడు నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో శనివారం ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకడిన సామాజికవర్గం దూదేకుల అని అన్నారు. వారి రాజకీయ, ఆర్థిక ఎదుగుదల కోసం గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దూదేకుల ఫెడరేషన్ నిధులను వాడుకుందని విమర్శించారు. ఇంత దౌర్భాగ్య పరిస్థితి ఎన్నడూ చూడలేదని అన్నారు. రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసమే బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందని తెలిపారు. టీడీపీ ఉన్నంత వరకు ముస్లిం మైనార్టీలకు ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు. మైనార్టీ రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని అన్నారు. చంద్రబాబు, పవన్‌పై విమర్శలు చేస్తూ.. ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని జగన్ చూస్తున్నారని ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ పెద్దలు హైదరాబాదులో అన్నప్పుడు జగన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. కేసుల నుంచి బయట పడేందుకు కేంద్రం ముందు మోకరిల్లారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని నడిపించుకోవడానికి, అప్పుల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన అసమర్థుడు జగన్ అని అన్నారు. ఐదేళ్ల కాలంలో రూ.పదిన్నర లక్షలకోట్లు అప్పుచేసి.. రాష్ట్రంలోని పుట్టిన ప్రతి బిడ్డ నెత్తిన రూ.3 లక్షలు అప్పు పెట్టారని విమర్శించారు. ఇప్పుడు కూడా ల్యాండ్ టైటింగ్ యాక్ట్ ముసుగులో ప్రజల భూములపై మరిన్న అప్పులు తెచ్చుకుని పాలన సాగించాలని చూస్తున్నారని అన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపాలన్నదే టీడీపీ లక్ష్యమని అన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 145 నుంచి 150 సీట్లతో గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థులకు ముస్లిం మైనార్టీలు తోడుగా ఉండాలని కోరారు.

- వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. టీడీపీ హయాంలో అమలైన పథకాలు కనుమరుగయ్యాయని అన్నారు. భూకబ్జాలు పెరిగిపోయాయని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ముస్లిం మైనార్టీలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాక్షసులు, కబ్జాకోరులకు కాకుండా మంచి కోరేవారికి అండగా నిలవాలని విన్నవించారు. వారి గెలుపులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్‌మహమ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రూరల్ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ తనయుడు ఉమర్, నూర్‌బాష దూదేకుల సంఘం నాయకులు ఖాసీం, దాదాఖలందర్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

గోడౌన్ల నుంచి తరలిస్తున్న అధికార పార్టీ నాయకులు



ప్రభుత్వ మద్యం.. వైసీపీ పరం..!

- దుకాణాల నుంచి సైతం గుట్టుచప్పుడు కాకుండా సరఫరా
- సహకరిస్తున్న సిబ్బంది
- మద్యం బాబులు అడిగితే నో స్టాక్..
- స్కానర్లు పనిచేయడం లేదంటూ సాకులు
- చోద్యంచూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

ప్రభుత్వ మద్యం వైసీపీ పరమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకులు.. అడ్డదారుల్లో ప్రభుత్వ మద్యాన్ని సొంతం చేసుకుంటున్నారు. అధికారం ఉంది కదా అని.. నేరుగా గోడౌన్ల నుంచే పలువురు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల నుంచి సైతం రాత్రిళ్లు నిబంధనలకు విరుద్ధంగా కేసుల కొద్దీ మద్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మద్యం దుకాణాల సిబ్బంది వారికి అన్నివిధాలా సహకారం అందిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మందుబాబులు వెళితే నోస్టాక్ అని చెబుతున్నారు. స్కానర్లు పనిచేయట్లేదనీ, వెబ్‌సైట్ రావట్లేదని సాకులు చెబుతున్నట్లు మందుబాబులు వాపోతున్నారు.

ధర్మవరం: సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ నాయకులు ముందుగానే ప్రలోభాలకు తెరతీస్తున్నారు. మద్యాన్ని కీలక అస్త్రంగా వాడుకుంటున్నారు. ఎరగా వేసి, కీలక వ్యక్తులను గుప్పిట్లో పెట్టుకుంటున్నట్లు సమాచారం. రహస్య ప్రాంతాల్లో మద్యం డంప్ చేసినట్లు సమాచారం. ఎన్నడూలేని విధంగా అధికార పార్టీ మాఫియా నియోజకవర్గ కేంద్రాల్లో రంగ ప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీనేతలు కొంతమంది నేరుగా ప్రధాన గోడౌన్లు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కేసులను రహస్యంగా ఇప్పటికే తరలించి, డంప్ చేసినట్లు ఆ పార్టీకి చెందిన నాయకులే చర్చించుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రాల వారీగా మద్యం, డబ్బు ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులకు అందజేసినట్లు తెలుస్తోంది. వారు మండల కేంద్రాల్లోని ఆ పార్టీ బూత్ ఏజెంట్లకు డబ్బు, మూడు మద్యం కేసులు అందించినట్లు సమాచారం. మరికొంత మంది నాయకులు నాటుసారా కాచే వారితో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొంతమంది సిబ్బంది.. అధికార పార్టీ నాయకుల నుంచి ముందస్తుగా డబ్బు తీసుకుని స్కానింగ్ చేసి, వారికి రాత్రికి రాత్రే రహస్యంగా మద్యం కేసులను సరఫరా చేస్తున్నట్లు సమాచారం.



మద్యం ప్రియులు మందు కోసం వెళితే ఆన్‌లైన్ పనిచేయట్లేదనీ, స్కానింగ్ కాలేదని సాకులు చెబుతున్నారని, ప్రశిస్తే వారికి మద్యం స్టాకు అయిపోయిందని చెబుతున్న మద్యం బాబులు వాపోతున్నారు. గట్టిగా నిలదీస్తే తాము అధికార పార్టీ కార్యకర్తలమనీ, తమనే ఎదిరిస్తావా అంటూ ఎదురు దాడికి దిగుతున్నట్లు సమాచారం. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 వరకు మద్యం దుకాణాలను తెరిచి ఉంచాల్సి ఉంది. మద్యం స్టాకు అయిపోయిందనీ, తాము ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకుంటామని చెబుతూ.. రహస్యంగా మద్యాన్ని బెల్టు షాపులకు అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. దీంతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తాం: పృథ్వీ, ఎక్సైజ్ ఎస్ఐ, పుట్టపర్తి

ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మనిషికి ఒక మద్యం బాటిల్ మాత్రమే విక్రయిస్తున్నాం. ఎక్కువ బాటిళ్ల అమ్మినట్లు మా దృష్టికి వస్తే సీసీ టీవీ పుటేజీ ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

ఓటు వేసేందుకు స్పెషల్ సీఎల్

అనంతపురం విద్య, మే 4 : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఎన్నికల కమిషన్ స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల డ్యూటీలో ఉండే ఉద్యోగులు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్స్ లేదా పోస్టల్ ఓటింగ్ సెంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి ఒక రోజు స్పెషల్ సీఎల్ మంజూరు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 845 జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను, జిల్లా ఎన్నికల అధికారులను ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.

నా గోడు పట్టదా..?

పింఛన్ డబ్బు అందక వృద్ధురాలి అవస్థ
నాలుగురోజులుగా బ్యాంక్, సచివాలయం చుట్టూ ప్రదక్షిణ

యాడికి, మే 4: పింఛన్ డబ్బులు వస్తే మందులు, సరుకులు కొనుక్కోవచ్చు అనుకున్న కొంతమంది వృద్ధులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుటెండలో బ్యాంక్, సచివాలయం చుట్టూ తిరుగుతూ ఎండలకు సొమ్మసిల్లి పడిపోయి మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఇదే కోవలో పింఛన్ సొమ్ము అందక తీవ్ర ఇబ్బందులు పడుతోంది యాడికిలోని హాస్పిటల్ కాలనీకి చెందిన నరసమ్మ అనే వృద్ధురాలు. 4వతేది వచ్చినా పింఛన్ డబ్బులు రాకపోవడంతో జీవనానికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం మండుటెండలో సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న సచివాలయం వద్దకు వచ్చి అధికారుల వద్ద తన గోడు వెళ్లబోసుకుంది. ఆ వృద్ధురాలిని పలకరించగా ఇంతవరకు పింఛన్ సొమ్ము రాలేదని కన్నీరు పెట్టుకుంది. మొదట బ్యాంక్‌లో పడతాయని అధికారులు చెప్పారని, మూడురోజులుగా బ్యాంక్ చుట్టూ తిరిగానని, అకౌంట్‌లో పింఛన్ సొమ్ము పడలేదని చెబుతున్నారని వాపోయింది. సచివాలయం వద్దకువచ్చి అధికారులను అడిగితే మీ ఇంటివద్దకు వచ్చి ఇస్తామని చెబుతున్నారని తెలిపింది. పింఛన్ డబ్బులు వస్తే మందులు కొనుక్కుంటానని చెప్పింది. దీనిపై సచివాలయ కార్యదర్శిని వివరణ కోరగా నరసమ్మ పింఛన్ సొమ్ము బ్యాంకులో జమచేయనున్నట్లు మొదట జాబితాలో వచ్చిందని తెలిపారు. తర్వాత పరిశీలిస్తే ఇంటివద్దకు వెళ్లి ఇచ్చే జాబితాలో ఉందన్నారు. సాంకేతిక సమస్యతో ఇలా జరిగి ఉంటుందని, నరసమ్మకు ఇంటివద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తామని తెలిపారు.



సచివాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు నరసమ్మ

భవనం సరే.. సౌకర్యాలేవీ..?

- ఎన్నికల కోసం హడావుడిగా ఆసుపత్రి ప్రారంభం
- వైద్యసదుపాయాలు లేక రోగుల అవస్థలు
- దయనీయంగా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రి



ప్రభుత్వ ఆసుపత్రి



పాతభవనంలో చికిత్స పొందుతున్న రోగులు

తాడిపత్రిటౌన్, మే 4: ఎన్నికలు వస్తున్నాయని తాడిపత్రిలో ప్రభుత్వ ఆసుపత్రిని హడావిడిగా ప్రారంభించేసి పాలకులు చేతులు దులుపుకున్నారు. భవనం చూడడానికి రంగు హంగులతో కనిపిస్తున్నా.. లోపల కనీస సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైన పటారం... లోన లొటారం అన్నచందంగా ఆసుపత్రి పరిస్థితి తయారయింది. ఆసుపత్రిని ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా వాటిలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. పనులు పూర్తి చేయకుండా సంబంధిత కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడన్న ప్రచారం ఉంది. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రి మూడు జిల్లాలకు సరిహద్దుగా ఉంది. కడప, నంద్యాల, అనంతపురం జిల్లాల సరిహద్దు మండలాలు ఎక్కువగా తాడిపత్రికి కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా తాడిపత్రికి తీసుకువస్తుంటారు. గతంలో 30 పడకల ఉన్న ఆసుపత్రిని ప్రస్తుతం వంద పడకలకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారు. సుమారు రూ.24కోట్లతో రెండేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభించారు. ఎన్నికల హడావిడి రావడంతో తమ ప్రాబల్యాన్ని చూపించుకోవాలని స్థానిక వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పనులు పూర్తికాకుండానే ప్రారంభించారు.

వైద్య సదుపాయాలు నిల్

సుమారు రూ.24కోట్లతో నిర్మించిన వందపడకల ఆసుపత్రి బయటకు చూడడానికి ఇంద్రభవనంలాగా ఉండగా లోపల మాత్రం ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. భవనంలో ఒక గదిలో మాత్రం ఓపీ సేవలు కొనసాగిస్తున్నారు. మిగతా గదుల్లో సదుపాయాలు లేకపోవడంతో రేకులషెడ్డుల్లోనే రోగులకు చికిత్సలు చేస్తున్నారు. గతంలో ఉన్న భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో నిర్మించారు. ప్రస్తుతం నిర్మించిన భవనంలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, వెంటిలేటర్ చికిత్సకు సంబంధించిన పైప్‌లైను సౌకర్యాలు ఇంతవరకు చేయకపోవడం దారుణం. కొన్ని గదులకు తలుపులు సైతం అమర్చలేదు.



కొత్త భవనంలో టైల్స్ పరచని దృశ్యం



బాత్రూంలో పైపు కనెక్షన్ ఇవ్వని దృశ్యం

రూ.6కోట్ల బిల్లులు పెండింగ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనుల కింద ఆసుపత్రి నిర్మాణం టెండరు నెల్లూరు జిల్లాకు చెందిన కంపెనీ దక్కించుకుంది. రూ.24 కోట్లతో ప్రారంభించిన పనులకు మొదటి దశలో బిల్లులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం దాదాపు పూర్తిచేసినప్పటికి మిగిలిన బిల్లులు రాలేదన్న సాకుతో ఏకంగా పనులే నిలిపివేయడం పలు విమర్శలకు తావిస్తోంది. స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పలుమార్లు నాణ్యతపై విమర్శించారు. ఆసుపత్రిని పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేసినా పట్టించుకోలేదు.

ఆసుపత్రిలో సదుపాయాలే లేవు

చూడడానికి మాత్రం ఆసుపత్రి ఇంద్ర భవనంలా ఉంది. లోపల పూర్తిస్థాయిలో వైద్యసదుపాయాలు కరువయ్యాయి. ఏరియా ఆసుపత్రి అని వస్తే ఇక్కడి సదుపాయాలు చూసి ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వస్తోంది.

- అమర్‌నాథ్, తాడిపత్రి


పాతభవనంలోనే వైద్యం

దూరప్రాంతాల నుంచి వైద్యం చేయించుకోవాలంటే కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందికరంగా మారింది. పాతభవనంలో ఉక్కపోతకు గురికావాల్సి వస్తోంది. అక్కడ వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బందికరంగా మారింది. ఆసుపత్రిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో వెళ్లలేని పరిస్థితి.

- మహమ్మద్ బాషా, టైలర్స్‌కాలనీ, తాడిపత్రి

ఆరోగ్యశ్రీ అపహాస్యం

- పేరుకుపోయిన బకాయిలు
- చికిత్సకు నిరాకరిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు
- వైద్యం అందక రోగుల అవస్థలు



ధర్మవరం, మే 4: పేదల వైద్యం కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అపహాస్యం పాలుచేశారు. పేరుకు మాత్రం ఈ పథకంలో చికిత్సలు అందించే వ్యాధులు సంఖ్య మూడు వేలకుపైగా చేర్చారు. పరిమితి రూ.5లక్షల నుంచి రూ.25లక్షలు పెంచేశారు. కానీ ఆ మేరకు వైద్యం అందలేదు. కోట్లాది రుపాయలు వ్యయం చేసి ఈ పథకం ద్వారా వైద్యసేవలు అందించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాన్ని తనయుడు జగన్‌రెడ్డి అటకెక్కించారు. కనీసం ఈ పథకం అమలు గురించి పట్టించుకోలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో 60 ప్రభుత్వాస్పత్రులు, 55 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. రాజశేఖర్‌రెడ్డి అనంతరం ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. ఈ పథకం అమలుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు సైతం ఆరోగ్యశ్రీ పథకానికి అంతే ప్రాముఖ్యతను ఇచ్చారు. గతంలో ఉన్న వ్యాధులకంటే మరికొన్నింటిని చేర్చారు. ఐదేళ్ల చంద్రబాబుపాలనలో ఏనాడూ ఈ పథకం అమలుపై ఇబ్బందులు తలెత్తలేదు. బిల్లులు బకాయిలు ఉన్నాయని ఆసుపత్రుల యజమానులు రోడ్డెక్కలేదు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కుర్చీ ఎక్కగానే ఆరోగ్యశ్రీకి అగచాట్లు మొదలయ్యాయి. వైద్యసేవలు అందించే ఆసుపత్రుల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఆయా ఆసుపత్రులు రోగులకు చికిత్సలు అందించడానికి నిరాకరిస్తున్నాయి. వైసీపీ రాష్ట్రంలోని రోగులతో ప్రభుత్వం చెలగాటమాడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలు అందిస్తున్న ఆసుపత్రులకు కోట్ల రుపాయలు బిల్లులు బకాయి పడింది. దీంతో పలుమార్లు ఈ ఆసుపత్రులు వైద్యసేవలు నిలిపేస్తూ నిరసన తెలిపాయి. ఆటువంటప్పుడు కంటితుడుపుగా ప్రభుత్వం కొంత బకాయిలు విడుదల చేసేది. దీంతో పలు ఆసుపత్రులు రోగులకు చికిత్స అందించడం నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో రోగులు రోజుల తరబడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితులలో వేలు, లక్షల రుపాయిల వ్యయం చేసి వైద్యం చేయించుకుంటున్నారు.

ఉద్యోగులపై 'రుద్దుడు'

రద్దు వదలి... కేసుల రుద్దుడు...!
వారంలో సీపీఎస్ రద్దు చేస్తామన్న జగన్
మాట తప్పి.. జీపీఎస్

అనంతపురం విద్య: వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఓట్లతో ఆటాడేస్తోంది. గత ఎన్నికలకు ముందు సీపీఎస్ ఉద్యోగులను నమ్మించింది. అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచేసింది. ప్రతిపక్షంలో ఉన్న జగన్ వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పాడు. తర్వాత 5 ఏళ్లలో ఇచ్చిన మాటను పక్కనబెట్టేశారు. అదలా ఉంచితే సీపీఎస్ రద్దు కోసం ఉద్యమ బాట పట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కేసులు రుద్దాడు. నిరసన తెలిపిన ఉపాధ్యాయులను, ఉద్యోగులను పోలీసులతో బలవంతంగా అరెస్టు చేయించాడు. అక్కడితో ఆగకుండా కేసులు కూడా పెట్టించి, బెదిరింపులకు పాల్పడ్డాడు. జగన్ ప్రభుత్వంతో సీపీఎస్ ఉద్యోగులకు జరిగిన న్యాయం ఇదీ. జగన్ వైఖరిని ఐదేళ్ల భరించిన సీపీఎస్ ఉద్యోగులు ఈ ఎన్నికల్లో తామేంటో చూపిస్తాం అంటూ మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 45 వేల మంది సీపీఎస్ టీచర్లు, ఉద్యోగులు జగన్ సర్కారుపై మండిపడుతున్నారు.

ఓట్ల కోసం జగన్ దొంగాట...

గత ఎన్నికల ప్రచారంలో జగన్ సీపీఎస్ ఉద్యోగులకు హామీ ఇచ్చాడు. రాష్ట్ర వ్యాప్తంగా తాను చేసిన పాదయాత్రల్లో పాల్గొన్న అనేక చోట్ల వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చాడు. సుమారు 109 సార్లు సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చినట్లు సీపీఎస్ ఉద్యోగులు చెబుతున్నారు. అయితే అప్పుడు ఓట్ల కోసం రద్దు చేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక..సీపీఎస్ ఉద్యోగులను వదిలేశాడు. వాళ్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిలువునా తొక్కేకాయాలని చూశాడు.

అరెస్టులు, కేసుల బహుమానం..

సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ సీపీఎస్ ఉద్యోగులు నిరసనలు తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఏటా సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగులు నిరసలు తెలిపారు. ముఖ్యంగా 2021,2022 సంవత్స రాల్లో టీచర్లు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపడంతో ఉపాధ్యాయులకు బలవంతంగా నోటీసులు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా పోలీసులను పెట్టించి అరెస్టు చేయడంతోపాటు, గురువులపై కేసులు కూడా పెట్టించాడు. జిల్లా వ్యాప్తంగా పలువురు టీచర్లపై కేసులు పెట్టించి, వాళ్లను కట్టడి చేయాలని చూశారు. దీంతో తీవ్ర అసహనంలో ఉద్యోగులున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది వరకూ సీపీఎస్ ఉపాధ్యాయులు, మరో 20 వేల మంది వరకూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల ఉద్యోగులు ఉన్నారు. జిల్లాలో 45 వేల మంది వరకూ సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులున్నారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్....అధికార పీఠంపై కూర్చొన్న తర్వాత...ఉద్యోగులను అంతు చూసేలా...వ్యవహరించారని మండిపడుతున్నారు. సీపీఎస్ రద్దు చేయకపోగా...ఉద్యోగ సంఘాల నేతలతో ఎలాంటి చర్చలు జరపకుండా, వారి అభిప్రాయాలను తుంగలో తొక్కి జీపీఎస్ తేవడం పట్ల ఉద్యోగులు మరింత మండిపడుతున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో తామేంటో ఓటు ద్వారా చూపిస్తామంటూ మండిపడుతున్నారు.

గద్దె దించితేనే తెలుస్తుంది




2019 ఎన్నికల ముందు జగన్ అధికారంలోకి రాగానే సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చాడు. ఐదేళ్ల గడిచినా సీపీఎస్ రద్దు చేయలేదు. జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని ఉద్యోగులు శాంతియుతంగా నిరసన తెలిపినా...అక్రమ కేసులు బనాయించిన నీచమైన జగన్ ప్రభుత్వం. 2024 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు.

- కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

అధికారంలోకి వచ్చాక మోసం

అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీఎస్ రద్దు చేస్తానని ఎన్నికల సమయంలో ఉద్యోగులకు హామీ ఇచ్చిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత జీపీఎస్ అనే కొత్త స్కీంను తీసుకొచ్చి ఉద్యోగులను మోసం చేశాడు. ఉద్యోగులు దాచుకున్న సీపీఎస్ డబ్బులను వాడుకుని సీపీఎస్ రద్దు చేయకుండా మాట మర్చాడు. ఉద్యోగుల్ని నమ్మించి మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ఉద్యోగులు తగిన గుణపాఠం చెబుతారు.



- శ్రీనివాసుల రెడ్డి, ఫోర్టో

టీచర్లపై పగ..!



- విద్యార్థుల వివరాల నమోదుకు ఇంటర్నెట్ సమస్య
- పలు పాఠశాలల్లో సాధ్యంకాని వైనం
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం
- అవేవీ పట్టని ప్రభుత్వం
- టీచర్లకు గుడ్డిగా నోటీసులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

కొత్తచెరువు, మే 4: ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం పగబట్టింది. అడుగడుగునా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఏచిన్న పొరబాటు జరిగినా బూతద్దంలో చూపిస్తూ ఉపాధ్యాయులను మానసిక క్షోభకు లోనుచేస్తోంది. పొరబాటు లేకున్నా కూడా వేధింపులకు దిగుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు తిరిగి ఇంటికి వచ్చేలోపు పిల్లల చదువు ఏమో కానీ ప్రభుత్వం పెట్టిన కండీషన్లతో నలిగిపోతున్నాడు. ఉన్నతస్థాయి అధికారి సైతం తనిఖీల పేరుతో నానా యాగీ చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందుల పాల్జేస్తున్నారు. ప్రస్తుతం యూడైస్ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయలేదంటూ ఏకంగా జిల్లాలో 523 మంది ఉపాధ్యాయులు, 62 మంది ఎంఈఓలకు వారం రోజుల క్రితం షోకాజ్ నోటీసులు ఇవ్వడం కలకలం రేపుతోంది. మారుమూల పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యంలేక ఉపాధ్యాయులు.. విద్యార్థుల వివరాలు నమోదు చేయలేకపోయారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉపాధ్యాయులు తప్పు చేసినట్లు చూపుతూ నోటీసులు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తప్పు ప్రభుత్వానిది.. శిక్ష తమకా అంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

నోటీసుల వెనుక...

పాఠశాలలో చదివే విద్యార్థుల సమగ్ర వివరాలు యూడైస్ యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థికి సంబంధించి 21 కాలమ్స్ భర్తీ చేయాల్సి ఉంటుంది. అందులోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే రిపోర్టును పొందుపరచాలి. ఇలా ఒక్కో విద్యార్థికి అరగంటపైగా సమయం పడుతుంది. ప్రతి విద్యార్థి పూర్తి సమాచారం తెలుసుకోవాల్సి ఉంటుంది. ఆ విద్యార్థి ప్రోగ్రెస్ రిపోర్టు ప్రధానోపాధ్యాయుడి పర్సనల్ డేటాలో నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థికి సంబంధించి ఆటల పోటీలు, ఆరోగ్యం, నెలలో ఎన్ని రోజులు పాఠశాలకు వచ్చాడు తదితర విషయాలతో పాటు స్కూల్‌లోని సమస్యలు, వాటి స్థితిగతులను కూడా యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. వీటిన్నంటినీ సమగ్రంగా రూపొందించాలంటే ఇంటర్నెట్ సదుపాయం తప్పనిసరి. పిల్లలకు చదువు చెప్పడం మానేసి, రోజూ వారి సమాచారాన్ని సేకరించడానికే సమయమంతా సరిపోతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.



జిల్లాకు సరఫరా అయిన రూటర్స్

ఇంటర్నెట్ సదుపాయం లేక..

యూడైస్ యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదుకు ఇంటర్నెట్ తప్పనిసరి. మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సమస్య తలెత్తడంతో విద్యార్థుల వివరాలు నమోదు చేయడం ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. సమస్యను ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు పెడచెవిన పెట్టారు. విద్యా సంవత్సరం పూర్తి కావడంతో పిల్లల సమగ్ర సమాచారాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో యూడైస్‌లో వివరాలు నమోదు చేయని విషయం తేలింది. ఇంటర్నెట్ సౌకర్యం లేదన్న విషయం కూడా తెలుసుకోకుండా ఉన్నతాధికారి ఇదే అదునుగా భావించి ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఎంఈఓలకు ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో 523 మంది ఉపాధ్యాయులు, 63 మంది ఎంఈఓలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏ తప్పూ చేయకున్నా.. వందలాది మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమని మండిపడుతున్నాయి. సౌకర్యాలు సమకూర్చకపోతే ఎలా పనిచేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

నోటీసులిచ్చాక.. రూటర్స్..

యూడైస్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయని ఉపాధ్యాయులు, ఎంఈఓలకు ఈనెల 23వ తేదీన నోటీసులు జారీ చేశారు. విచిత్రమేమిటంటే ఆ మరుసటి రోజు జిల్లాలోని 228 పాఠశాలలకు రూటర్స్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది. ఆయా స్కూళ్లలో సిగ్నల్ లేక ఇంటర్నెట్ సమస్య ఉండడంతో ప్రత్యేకంగా రూటర్లను అమర్చనున్నారు. వీటి ద్వారా సమస్య పరిష్కారం అవుతుంది. ఈ లెక్కన పాఠశాలల్లో ఇంటర్నెట్ సమస్య ఉందని విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికెళ్లినా.. పట్టించుకోకుండా గుడ్డిగా నోటీసులు ఇచ్చేశారన్న విషయం స్పష్టమవుతోంది. ఇంటర్నెట్ సమస్య లేకుంటే రూటర్స్ ఎందుకు సరఫరా చేశారన్న ప్రశ్న ఉపాధ్యాయ వర్గాల నుంచి ఉత్పన్నమవుతోంది.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే నోటీసులు..



జిల్లాలోని ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను కూడా లేవని చూపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నోటీసులను జారీ చేసింది. ఆ మేరకు తాము జిల్లాలోని ఉపాధ్యాయులు, ఎంఈఓలకు నోటీసులు జారీ చేశాం.

- మీనాక్షి, డీఈఓ


టీడీపీలోకి చేరిన వారితో పరిటాలశ్రీరామ్

టీడీపీలోకి 65 కుటుంబాలు చేరిక

ధర్మవరం రూరల్, మే4: మండలంలోని ధర్మపురి, నాగలూరు గ్రామాలకు చెందిన 65 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో శనివారం వారు పరిటాల శ్రీరామ్‌ను కలిసి ఆయన సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో విష్ణు, పరమేష్, అప్పస్వామి, ఈశ్వరయ్య, ఆంజనేయులు, రవి, రామచంద్ర, రాము, లక్ష్మీదేవి, విశాక్, ఆంజనేయులు, అభితదితరులు ఉన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌ను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడితే భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహేష్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, తెలుగుయువత విజయ్‌చౌదరి, భాస్కర్ చౌదరి, చంద్రశేఖర్, గోవిందు, రాజు, గొట్లూరు రహీమ్ పాల్గొన్నారు.

కూటమిదే అధికారం: మాజీ మంత్రి పల్లె

బుక్కపట్నం, మే 4: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో శనివారం వలంటీర్లు వరలక్ష్మి కుటుంబంతో పాటు సుమారు 30 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో వారు చేరగా.. ఆయన కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం ఖాయంగా కన్పిస్తోందన్నారు. ఎక్కడ చూసినా వైసీపీ వాళ్లు టీడీపీలోకి చేరడమే ఇం దుకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఇప్పుడు కూటమిని గెలిపించేందు కు అందరూ ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నల్లమాడ/ కొత్తచెరువు: నల్లమాడ మండలం దొన్ని కోట గ్రామానికి చెందిన పది కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కొత్తచెరువు మండలం నారేపల్లి పంచాయతీ చిన్నబోయనపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె సమక్షంలో చేరారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి: పల్లె కిశోర్

బుక్కపట్నం: సార్వత్రిక ఎన్నిక లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ యువనేత పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుక్కపట్నం మండలం గసికవారిపల్లి పంచాయతీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికి ఎండ్లబండిపై ఊరేగించారు. తర్వాత ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. అవినీతి పాలన సాగించిన వైసీపీని ఇంటికి సాగనంపాలని కోరారు. కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: మండలంలోని దిగువచెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి, సాతార్లపల్లి గ్రామాల్లో టీడీపీ యువనాయకుడు పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి కూటమి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కూటమితోనే ప్రజాసంక్షేమం: పల్లె సింధూర

పుట్టపర్తి/కొత్తచెరువు: ప్రజాసంక్షేమం కూటమితోనే సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి పరిధిలోని ప్రశాంతి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. సత్యసాయి నడయాడిన ప్రాంతంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అరాచక పాలన సాగించారన్నారు. ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్య మన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. కొత్తచెరువు మండలం మామిళ్లపల్లికుంటక్రాస్, గుంటిపల్లి, గోరంట్లపల్లి గ్రామాల్లో పల్లె సింధూర కూటమి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలనికోరారు.


బుక్కపట్నంలో టీడీపీలో చేరినవారితో మాజీ మంత్రి పల్లె


పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లిలో పల్లె కిశోర్‌రెడ్డి ప్రచారం


ప్రశాంతి గ్రామంలో పల్లె సింధూర ప్రచారం

పంచాయతీ నీరు అక్రమ వాడకానికి అడ్డుకట్ట


పంచాయితీ బోరు నుంచి పొలాలకు నీరు వెళ్లకుండా వెళ్లే పైపును బ్లాక్ చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్, మే4: మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో పంచాయతీ తాగునీరుకు స్థానిక వైసీపీ సర్పంచ్ ఈశ్వరమ్మతో పాటు ఆమె కుటుంబసభ్యులైన వైసీపీ నాయకులు వాసుదేవరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పొలాలకు పంచాయతీ బోరు నుంచి పైపుల ద్వారా తిప్పుకుంటున్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. ఈ విషయంపై ఈనెల 3న సర్పంచ్ దర్జా, పంచాయతీ నీరు తోటలకు మళ్లింపు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. శనివారం మండల, పంచాయతీ అధికారులు గ్రామానికి వెళ్లి పంచాయతీబోరు నుంచి పొలాలకు నీరు సరఫరా చేసే వెళ్లే పైపులైన్‌ను బ్లాక్ చేశారు. దీంతో గ్రామానికి తాగునీరు సరఫరా కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి స్పందన

వైసీపీ తరపున వలంటీర్ల ప్రచారం


కరపత్రాలను ఇంటిలో ఇచ్చి వెళ్తున్న వలంటీర్లు శ్రీకాంత్, రాధమ్మ, కళ్యాణి

ధర్మవరం రూరల్, మే4: మండలంలోని మల్లాకాల్వ గ్రామంలో వలంటీర్లు శ్రీకాంత్, రాధమ్మ, కళ్యాణి శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఓటు వేయాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఓటువేయాలని కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఇచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే మీకు పథకాలు వస్తాయంటూ ప్రచారం చేశారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసినా గ్రామాల్లో అవేవీ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వలంటీర్లు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయినా ఇంకా కొంతమంది అధికారులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ తమ స్వామి భక్తిని చాటుకున్నారు.

జౌకలలో వ్యక్తి హత్య

- ఇద్దరిపై కేసు నమోదు


భూషణ (ఫైల్)

కదిరిఅర్బన్, మే 4: వ్యక్తి హత్యకు గురైన సంఘటన కదిరి మండలంలోని జౌకల గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి సోదరి చంద్రమ్మ శనివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూషణ(38) అవివాహితుడు. బేల్దారి పని చేసుకుని జీవనం సాగించేవాడు. అతడికి మద్యం సేవించే అల వాటు ఉంది. కాగా తరచూ అదే గ్రామానికి చెందిన జయచంద్ర నాయుడు, గోవర్ధనాయుడుతో గొడవపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటిబయట ఒక్కడే నిద్రించాడు. శనివారం తెల్లవారుజామున లేచిచూడగా విగత జీవిగా కనిపించాడని, కొడవలితో తలపై నరికినట్లు గుర్తులున్నాయని తెలిపారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, అనుమానితులుగా ఉన్న జయచంద్రనాయుడు, గోవర్ధనాయుడుపై దర్యాప్త చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్

పుట్టపర్తి రూరల్, మే 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎవరైనా విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ సిబ్బందిని హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలన్నారు. మద్యం అక్రమ సరఫరా అయ్యే మార్గాల్లో రూట్‌వాచ్ చేపట్టాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలాగే పాతనేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని ఆదేశించారు. జిల్లా సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఇన్స్‌పెక్టర్ కన్నయ్య, సిబ్బందిని ఉన్నారు

సెబ్ కార్యాలయం తనిఖీ

ధర్మవరం: పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను అనంతపురానికి చెందిన సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో కేసుల పురోగతి, రికార్డులను తనిఖీ చేశారు. తర్వాత ఇబ్బందితో మాట్లాడుతూ.. మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీ లాంటివి జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. సెబ్ సీఐ గురుప్రసాద్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మే 4: పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డు రైల్వేట్రాక్‌పై శనివారం షాహీద్‌బాషా (20) అనే యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన రఫీ, రషీదా దంపతుల కుమారుడు షాహీద్‌బాషాకు కొంతకాలంగా మతిస్థిమితం లేక బాధపడుతుండేవాడు. పలుచోట్ల వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్


కాళసముద్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్


కదిరిలోని 5వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరిఅర్బన్, మే 4: ఎన్నికల్లో ఆదరించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ప్రజల్ని కోరారు. రూరల్ పరిధిలోని వీరుపల్లిపేట, ఎట్టిగడ్డతండా, పట్నం, మాచిరెడ్డిపల్లి, కాళసముద్రం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. గ్రామాల ప్రజలు, స్థానిక నాయకులు బాణసంచా కాల్చి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. తర్వాత ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. రుణం తీర్చుకుంటానని తెలిపారు. నియోజవకర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ నాయకులు అడ్డదారులు తొక్కేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈవిషయన్ని ప్రజలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు హరి, ఉపేంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్, రవికుమార్, రాజశేఖర్, అంజి, బీజేపీ ఎర్రమశెట్టి రమేష్ బాబు, చలపతి, జనసేన నాయకులు కొట్టు అశ్వర్థకుమార్, చిల్లా మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కందికుంట యశోదమ్మ ప్రచారం

కదిరి: పట్టణంలోని 5వ వార్డులో కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వాటి వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 5వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఇమ్రాన్, నాయకులు బశెట్టి మహేంద్ర, భాస్కర్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

తనకల్లు: మండలంలోని ఉస్తిలిపల్లికి చెందిన 20కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో శుక్రవారం రాత్రి వారు ఆయన సమక్షంలో చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరినవారితో కందికుంట

గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

తనకల్లు, మే 4: మండలంలోని బాలసముద్రం పంచాయతీ కొక్కంటిక్రాస్‌లో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, దేశాయి విదుర శేఖర్‌రెడ్డి, బీగం శంకర్‌నాయుడు, గోవిందు, రాజారెడ్డి, నాగభూషణం, పీజీ మల్లికార్జున, ఉత్తన్ననాయక్, సర్పంచ్ బూగిడే చంద్ర తదితరులు శనివారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే పథకాలు అమలవుతాయని పేర్కొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొక్కంటి క్రాస్‌లో సూపర్ సిక్స్ పై ప్రచారం చేస్తున్న నాయకులు

గాండ్లపెంట: మండలంలోని పలు గిరిజన తండాలో బంజారా నాయకులు సూపర్ సిక్స్ పథలకాపై ముమ్మర ప్రచారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న 10 తండాల బంజార సంఘం నాయకులు తండాల్లో ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించారు. కూటమి అధికారంలోకి రాగానే పథకాలు అమలవుతాయని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కందికుంట వెంకట ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు శీనానాయక్, క్రిష్ణానాయక్, అంజినాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో కూటమి శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆ పథకాల వల్ల కుటుంబంలోని అందరికీ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఆ పథకాలను వెంటనే అమలు చేస్తారని చెప్పారు. కూటమి గెలుపునకు సహకరించాలని ప్రజల్ని కోరారు. కమలం గుర్తుకు ఓటువేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. టీడీపీ మాజీమండల కన్వీనర్ సాయి నాయకులు రమణ, సాంబశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్


ఆలయాన్ని సందర్శిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

లేపాక్షి, మే 4 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మనీష్‌సింగ్ ఐఏఎస్, అజయ్‌నాథ్‌యూ ఐఏఎస్, రవికుమార్ ఐపీఎస్ అన్నారు. వారు శనివారం దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహశర్మ స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ సిబ్బంది అధికారులను దుశ్శాలువలతో సత్కరించారు.

కంకర వేశారు.. తారు మరిచారు..

తనకల్లు, మే 4: మండలంలోని నక్కరాళ్లతండా నుంచి నడిమికుంటపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కొద్దిరోజుల క్రితం నక్కరాళ్ల తండా నుంచి నడిమికుంటపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో కంకర కూడా పరిచారు. ఇంతలో ఏమైందో ఏమో తారు వేయడం మరిచారు. రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో నడిమికుంటపల్లి, సుబ్బరాయునిపల్లి, రత్నగిరి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే నరకంగా ఉందని, ద్విచక్రవాహనదారులు అయితే ప్రమాదాలకు గురవుతున్నాయని వారు వాపోతున్నారు. కంకర పరిచిన కాంట్రాక్టర్ తారు వేయడం ఎందుకు మరిచారో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.


నడిమికుంటపల్లి రోడ్డుకు కంకర వేసి వదిలేసిన దృశ్యం

వైసీపీకి బుద్ధి చెప్పండి: సత్యకుమార్


ధర్మవరంలో ప్రచారం చేస్తున్న సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, మే 4: రాష్ట్రంలో ఆద్యంతం అవినీతి పాలన సాగించిన వైసీపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని రాంనగర్, గుట్టకిందపల్లి, తారకరామాపురం, సాయినగర్, యాదవవీధి, పార్థసారధినగర్ ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటా తిరిగి ఎమ్మెల్యేకు కమలం గు ర్తుకు ఓటేయాలని, ఎంపీకి సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కూటమి అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నీ అమలవుతాయని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ అవలంబించిన ప్ర జా వ్యతిరేక పాలన వల్ల రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందన్నారు. దీం తో రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకే కూటమి ఏర్పాటైందని తెలిపారు. ఎన్నికల్లో ఆ అవినీతి పాలనకు బుద్ధి చెప్పాలని, కూటమిని గెలిపించాలని కోరారు. ఇక ని యోజవర్గంలో భూకబ్జాలు, దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్న కేతిరెడ్డిని కూడా ఇంటికి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

- ధర్మవరం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి అనుచరులు గరుగు మల్లికార్జున, రాజు, చింతమంజునాథ, రాజు, సుధాకర్, నారాయణస్వామి, నారాయణ, శీన, షాషా, జయకృష్ణ, పవన్, జస్వంత్,ప్రకాశ్, మోహన్, గోపాల్,హరితోపాటు 25 కుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. సత్యకుమార్ సమక్షంలో చేరగా.. ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సత్యకుమార్‌ను గెలిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు

ముదిగుబ్బ: భావితరాలు బాగు పడాలంటే కూటమి అధికారంలోకి రావాలని కర్ణాటక రాష్ట్రంలోని ఆర్ఆర్ నగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో జరిగిన కూటమి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఇక్కడ సత్యకుమార్‌ను గెలిపిస్తే ధర్మవరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని చెప్పారు. రాష్ట్రం నుంచి వచ్చే నిధులే గాక, కేంద్రం నుంచి సైతం ప్రత్యేక నిధులను తెచ్చి అభివృద్ధి చేసే సత్తా సత్యకుమార్‌కు ఉందన్నారు. కనుక కమలం గుర్తుకు ఓటు వేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ వస్తున్నాడని..

- ఐదేళ్లుగా ఉన్న గుంత హడావుడిగా పూడ్చివేత
- పట్టణవాసుల విమర్శలు


గుంత ఉన్నచోట కంకరపరిచి రోడ్డురోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

హిందూపురం, మే 4 : పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి ఐదేళ్ళవుతోంది. ఇక్కడ పలు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు దానివైపు కన్నెత్తి కూడా చూడలేదు. అయితే శనివారం ముఖ్యమంత్రి ఆ రహదారి గుండా పర్యటిస్తారని కంకరవేసి గుంత పూడ్చారు. ఇదిచూసిన ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ప్రాణాలు పోయినప్పుడు స్పందించని అధికారులు ముఖ్యమంత్రి వస్తుండటంతో కంకర వేస్తున్నారని మండిపడ్డారు.

వర్షం కోసం ముస్లింల ప్రార్థనలు

రాయదుర్గంరూరల్, మే 4: పట్టణంలోని బళ్లారిరోడ్డు ఈద్గా మైదానంలో వరుణుడి కరుణ కోసం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశా రు. శనివారం ఈద్గా మైదానంలో వెయ్యి మందికి పైగా హాజరై ప్రభుత్వ ఖాజీ మహ్మద్ సైపుల్లా, ఉలమాల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

చంద్రబాబుతోనే పాలసముద్రం ప్రఖ్యాతి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత
- ప్రచారానికి అపూర్వ ఆదరణ




పాలసముద్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

గోరంట్ల, మే 4: మండలంలోని పాలసముద్రం ప్రాంతం ప్రపంచ పటంలో గుర్తింపు వచ్చేలా చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం, వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి పంచాయతీ గ్రామాల్లో రోడ్‌షో ద్వారా సవిత శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాలసముద్రంలో పెద్దఎత్తున జనం తరలివచ్చి గజమాలలు, హారతులు, పూల వర్షంతో ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... కియ పరిశ్రమ ద్వారా జిల్లాలోని యువతకు భవిష్యత్తు చూపింది టీడీపీనే అన్నారు. పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ తదితర పరిశ్రమల ఏర్పాటుతో ప్రస్తుతం రైల్వే లైన్ వస్తోందని, ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయ న్నారు. ఇంకా పరిశ్రమంలు వచ్చి ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారం లోకి రావాలన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇన్‌కమ్ ట్యాక్స్ లేని వైసీపీ నాయకులు నేడు రూ. వేలకోట్లకు అధిపతులు ఎలా అయ్యారని ప్రశ్నించారు. ఇద్దరు మంత్రులు వచ్చినా ఈప్రాంతం అభివృద్ధి జరగలేదన్నారు. దళితులంటే వైసీపీకి చిన్నచూపన్నారు. దళితులను ఇంటిలోకి అనుమతించని మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఓటు ఎలా వేస్తారన్నారు. ల్యాండ్, లిక్కర్, శ్యాండ్ మాఫియా మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను, బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల యువ శేఖర్, నిమ్మల చంద్రశేఖర్, అశ్వత్థరెడ్డి, బెల్లాచంద్ర, మనోహర్, మూర్తి, ప్రకాష్, కట్టుబడి ఆంజి, సుబహాన్, ప్రసాద్, నరసింహమూర్తి, చంద్రశేఖర్, అమ్మిబాయి, రాజేష్‌నాయక్, కోగిర శ్రీని వాసులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చే అర్హత జగన్‌కు లేదు

పెనుకొండ టౌన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాకు సీఎం జగన్ ఏం మొహం పెట్టుకుని వచ్చారని కూటమి ఎమ్మెల్యేఅభ్యర్థి సవిత ప్రశ్నించారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా ప్రజల వద్దకు వెళ్లడానికి అర్హత లేదన్నారు. ఆమె శనివారం పెనుకొండ నియోజకవర్గంలో పలు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సవిత మీడియాతో మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అడగడానికి, వైసీపీ ఏం అభివృద్ధి చేసిందని సభలు పెడుతున్నారని అన్నారు. ఈ జగన్ రాయలసీమ ద్రోహి అని 2019లో జగన్ ఎన్నికల ప్రచారంలో ఏం చెప్పారో ఇప్పుడు... ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతంలో ఏ అభివృద్ధి పనులైనా చేశారా అంటూ ప్రశ్నించారు. జిల్లాకు పరిశ్రమలు తెచ్చారా, రిజర్వాయర్లు నిర్మించారా, ఉద్యోగ, ఉపాధి కల్పించారా, రైతులకు నీరందించారా అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఇవన్నీ చేయకపోగా అన్ని వ్యవస్థలను నాశనం చేసిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రచారానికి వెళ్తుంటే ఓ పక్క కియ, దాని అనుబంధ పరిశ్రమ నాసెన్, బెల్ తదితర వాటికి వెళ్లి ఉపాధి పొందుతు న్నామని ప్రజలు అంటున్నారన్నారు. ఈ వైసీపీ పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదని ఏ గడపకు వెళ్లినా చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

పెనుకొండ టౌన్: నియోజకవర్గంలోని పలు కుటుంబాలు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పట్టణంలోని తన నివాసం వద్ద వారికి పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. రొద్దం మండలం సానిపల్లికి చెందిన హనుమంతరాయుడు, సంజీవరాయుడు, ప్రభు, పరమేష్, సోమందేపల్లి పట్టణానికి చెందిన సురేంద్ర తదితరులు టీడీపీ చేరారు.



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సవిత

నేడు పురానికి బాలకృష్ణ రాక

- వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి హాజరు..



హిందూపురం, మే 4: స్థానిక నియోజకవర్గం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నంద మూరి బాలకృష్ణ ఆదివారం హిందూపురానికి రానున్నారు. వారం రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించిన బాలకృష్ణ ఆదివారం హిందూపురానికి చేరుకుంటారు. పట్టణంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 3గంటలకు జరిగే వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి హాజరుకాను న్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాల్మీకులు తరలిరావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. అదేవిధంగా నందమూరి వసుందరదేవి ఆదివారం లేపాక్షి మండలంలో ప్రచారం నిర్వహించనున్నారు.

టీడీపీతోనే మడకశిర భవిష్యత్తు

ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్‌రాజు



ఎన్నికల ప్రచారంలో ఎంఎస్‌రాజు, గుండుమల

రొళ్ల, మే 4: తెలుగుదేశం పార్టీతోనే మడకశిర అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆయన శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మండల పరిధిలోని హాలికుంట, గుడ్డగుర్కి, దొడ్డేరి పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో అడుగడుగునా హారతులు పట్టి, గజమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా గుండుమల, ఎంఎస్ రాజు మాట్లాడుతూ... ఈ ఐదేళ్లు మడకశిరలో వైసీపీ రాక్షసపాలన సాగిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ బీఎం పాండురంగప్ప, టీఎన్‌టీయూసీ కార్యదర్శి గురుమూర్తి, నాయకులు ఈరన్న, మూర్తి, కృష్ణమూర్తి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మడకశిరటౌన్: బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎంఎస్ రాజు శనివారం గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన 'మన మడకశిర ఎంఎస్ రాజు' అనే పేరుతో మడకశిర ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారు. అందులోని అంశాలను వివరిస్తూ... హంద్రీనీవా బైపాస్ కెనాల్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిరకు నీరు సరఫరా చేస్తామన్నారు. అలాగే రాళ్లపల్లి, రత్నగిరి కొల్లాపురమ్మ రిజర్వాయర్ల నిర్మాణం, ఆర్ అనంతపురం పారిశ్రామిక వాడలో పరి శ్రమల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన, నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువల వెడల్పు, ప్రతి చెరువుకు కృష్ణా జలాలు చేర్చడమే లక్ష్యమన్నారు. అసంపూర్తిగా ఉన్న గురుకుల విద్యాలయ భవనాల నిర్మాణం, వక్క పంటకు మార్కెటింగ్ సౌకర్యం, మడకశిర పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణం, అగళి మండలం గాయత్రీకాలనీలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన ప్రతి పని పూర్తి చేస్తామన్నారు. అలాగే నగర పంచాయతీలోని వజ్రపాళ్యం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, హమాలీ అసోసియేషన్‌కు చెందిన 40 కుటుంబాలు, చీపులేటి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. అనంత రంఅభ్యర్థి ఎంఎస్ రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. గుండుమల తిప్పే స్వామి, శ్రీనివాసమూర్తి తదితరులు పట ణంలోని ఆర్‌పేటనరసింహస్వామి ఆల యంలో విశేష పూజలు చేయించారు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎంఎస్ రాజు తదితరులు

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

అగళి : టీడీపీని ఆశ్వీర్వదించండి అభివృద్ధి చేస్తామని టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. ఆమె శనివారం మండలంలోని ఎంఎం పాళెం, రామాపురం, అగళి లో బీజేపీ రాయలసీమజోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ బూత్ కమిటీ సభ్యులకు రఘువీరారెడ్డి దిశానిర్దేశం

అగళి, మే 4 : కాంగ్రెస్ పార్టీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా పనిచేయాలని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఆయన శనివారం అగళి మండల కేంద్రంలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో నిర్వహించాల్సిన అంశాలపై తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్, మండల కన్వీనర్ లోకేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజకుమార్, నాయకులు త్యాగరాజ్, నరసింహమూర్తి, బూత్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం

రొద్దం, మే 4 : కాంగ్రెస్ పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహులు, హిందూపురం ఎంపీ అభ్యర్థి సమద్‌షాహీన్‌కు మద్దతుగా పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని బొక్సంపల్లి, ఎల్‌జీబీ నగర్, తురకలాపట్నం, పాతర్లపల్లి, పెద్దకోడిపల్లి, రొద్దం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహులుతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెనుకొండ మండల కన్వీనర్ ప్రకాశ్‌రెడ్డి, నాయకులు గోవిందప్ప, వెంకటరామిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

లేపాక్షి, మే 4: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మనీష్‌సింగ్ ఐఏఎస్, అజయ్‌నాథ్‌ఝా ఐఏఎస్, రవికుమార్ ఐపీఎస్ అన్నారు. వారు శనివారం దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహశర్మ స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ సిబ్బంది అధికారులను దుశ్శాలువలతో సత్కరించారు.

సీఎం వస్తున్నారని..

ఐదేళ్లుగా ఉన్న గుంత పూడ్చివేత

పట్టణవాసుల విమర్శలు



గుంత ఉన్నచోట కంకరపరిచి రోడ్డురోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

హిందూపురం, మే 4: పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి ఐదేళ్లవుతోంది. ఇక్కడ పలు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు దానివైపు కన్నెత్తికూడా చూడలేదు. అయితే శనివారం ముఖ్యమంత్రి ఆ రహదారి గుండా పర్యటిస్తారని కంకరవేసి గుంత పూడ్చారు. ఇదిచూసిన ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ప్రాణాలు పోయినప్పుడు స్పందించని అధికారులు ముఖ్యమంత్రి వస్తుండటంతో కంకర వేస్తున్నారని మండిపడ్డారు.

మద్యం అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండండి

- సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్
- సెబ్ స్టేషన్ తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్

పెనుకొండ రూరల్, మే 4 : ఈ నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఆయన శనివారం పెనుకొండలోని సెబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్రమ మద్యం నిలువచేసే గోదాములను, రవాణా మార్గాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెంచాలని, సరిహద్దులలో చెక్‌పోస్టులను మరింత బలోపేతంచేసి అక్రమ మద్యం కట్టడి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఈ యేడాది ఇప్పటి వరకు 136 కేసులు నమోదుచేసి 298లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా 17,170లీటర్లు ధ్వంసం చేసినట్లు తెలిపారు. 1064 కేసుల్లో 105వాహనాలు సీజ్ చేశామన్నారు. వివిధ కేసుల్లో ఉన్న 363 మందిని 109, 110సెక్షన్‌ల కింద బైండోవర్‌చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో ఊపందుకున్న ప్రచారం

హిందూపురం, మే 4 : సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పల్లెల్లో ప్రచారం ఊపందుకుంది. ఆయా పంచాయతీలు, వార్డులవారీగా నాయకులు, కార్యకర్తలు ఉదయం, సాయంత్రం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోపాటు ఉమ్మడి మేనిఫెస్టోను గడప గడపకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వైసీపీ మరోసారి వస్తే మనం పక్కరాష్ట్రానికి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పల్లెల్లో వీధివీధికి బెల్ట్‌షాపులు పెట్టారని వీటివల్ల యువత తాగుడుకుబానిసై జీవితాలు నాశనం చేసుకుంటోందని వివరిస్తు న్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆకట్టుకునేలా ఉందని వివరిస్తున్నారు. కొటిపిలో శనివారం టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు అరుణాచలరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, బాలంపల్లిలో అంజినరెడ్డి, వెంకటరామిరెడ్డి ప్రచారం నిర్వహించగా మోతుకపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు.



కొటిపిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

జౌకలలో వ్యక్తి హత్య

- ఇద్దరిపై కేసు నమోదు

కదిరిఅర్బన్, మే 4: వ్యక్తి హత్య చేసిన సంఘటన కదిరి మండలంలోని జౌకల గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం మృతుని అక్క చంద్రమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూషణ(38) అవివాహితుడు బెల్దారి పని చేసుకుని జీవనం సాగించేవారు. మృతునికి మద్యం సేవించే అలవాటు ఉందని, తరచూ అదే గ్రామానికి చెందిన జయచంద్రనాయుడు, గోవర్ధ నాయుడుతో గోడవపడేవారన్నారు. శుక్రవారం రాత్రి ఇంటిబయట ఒకడే నిద్రించాడు. శనివారం తెల్లవారుజామున లెచిచూడగా కోడవలితో తలపై న రికినట్లు గుర్తులున్నాయని తెలిపారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, శవాన్నిపోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, అనుమానితులుగా ఉన్న జయచంద్రనాయుడు, గోవర్ధనాయుడుపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మోహన్ తెలిపారు.



భూషణ (ఫైల్)

వలస ఓటర్లపై గురి

- రప్పించేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పొరుగు రాష్ట్రాలకు వెళ్లిన నాయకులు
- పోలింగ్ రోజున వాహనాలు, భోజనాలు సైతం
- బంధువుల ద్వారా వివరాల సేకరణ
- ఓటును కీలకంగా భావిస్తున్న అభ్యర్థులు



హిందూపురం, మే 4 : రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలు ప్రధాన పార్టీలకు కీలకం. దీంతో ప్రతి ఓటు అభ్యర్థికి అవసరం కావడంతో ఏ ఒక్క ఓటరును వదులుకోకుండా వారిపై అభ్యర్థులు గురిపెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతుంటే రాజకీయ నేతలతో పాటు జనాల్లో ఉత్కంఠ పెరిగింది. అందుకే వలస ఓటర్లపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల నుంచి సుమారు 50వేల మందిదాకా వలస పోయారు. వారంతా కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్రలకు జీవనోపాధికి వెళ్లారు. వారిని పోలింగ్ రోజున తీసుకొచ్చేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ బాధ్యతలను ద్వితీయ శ్రేణి నాయకులకు అప్పగించారు. వారు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఓ వైపు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతుండగా బయటి ప్రాంత ఓటర్లను ఎలా రప్పించాలి అనేదానిపై దృష్టి పెట్టారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

పోలింగ్ రోజున వలస ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ఫోకస్ పెంచారు. అభ్యర్థుల వద్ద నమ్మకంగా ఉన్న ద్వితీయశ్రేణి నాయకులకు వలస ఓటర్లను రప్పించే బాధ్యతలు అప్పగించారు. వారు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వలస ఓటర్ల వద్దకు పంపుతున్నారు. అదికూడా సామాజిక వర్గాల వారీగా బృందాలు ఏర్పాటుచేసి ఆయా సామాజిక వర్గ ఓటర్లను కలిసేందుకు వ్యూహరచన చేశారు. ఇప్పటికే ఓ రౌండ్ వెళ్లివచ్చారు. అయితే ఒక పార్టీ నాయకులు రెండు రోజులుగా వలస ఓటర్లపై దృష్టిపెట్టారు. వారికి సంబంధించిన నాయకులు కర్నాటకలోని బెంగళూరు, చిక్కబళ్లాపురం, కోలార్, తుమ కూరు, మైసూరు, బళ్లారి, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడికి వెళ్లి వారికి ఒక్కసారి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి, నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్నారు. ఇంకొందరి వివరాలు, ఫోన్‌నంబర్లు ఆరాతీస్తున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 13న జరిగే పోలింగ్‌కు వలస ఓటర్లను రప్పించే బాధ్యతను ప్రత్యేకంగా తీసుకోగా ఆ రోజు వారు వచ్చేందుకు వాహనాల ఏర్పాటు, వారికి భోజనాలు, తదితర సదుపాయాలపై ఇప్పటికే కొంతమందికి ఆ పనులు అప్పజెప్పారు. పోలింగ్ సోమవారం జరుగనుండటంతో శనివారం సాయంత్రానికే వలస ఓటర్లు స్వగ్రామాలకు వచ్చేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు. పది మంది లోగా ఉంటే కారు, 30మంది లోపు ఉంటే మినీబస్సు, అంతకంటే ఎక్కువ ఉంటే బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారు పోలింగ్ రోజున వస్తే భోజనాలు, ఇతర వసతులను స్థానికంగా సిద్ధం చేస్తున్నారు.

బంధువుల ద్వారా వివరాల సేకరణ

ఇదిలా ఉంటే వలస ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే దానిపై బూత్ ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు. వలస ఓటర్లను గుర్తించి వారి బంధువుల వద్దకు వెళ్లి ఎక్కడ జీవనోపాధికి వెళ్లారో తెలుసుకుంటున్నారు. వారి ఫోన్ నంబర్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అధికార పార్టీలో ఓ ప్రత్యేక టీమ్ ఇందుకోసం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోంది. వారు ఎక్కడున్నారు పోలింగ్‌కు వచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారా లేదా అనేదాన్ని బంధువుల ద్వారా ఆరాతీస్తున్నారు.

వలస ఓటర్ల చూపు.. ఎటువైపు?

సొంతూళ్లలో భూములు, పనులు లేనివారు గతంలో అధికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు, అఘాయిత్యాలు, భూదందాలు అధికం కావడంతో చాలా మంది చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేకపోవడం వల్ల చేతినిండా పని దొరకక వలస వెళ్లినవారే చాలామంది ఉన్నారు. అదేవిధంగా అధికార పార్టీ నాయకుల బెదిరింపులు తాళలేక భయభ్రాంతులకు గురై పక్కరాష్ట్రాలకు వెళ్లిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటువేసే వలస ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఇటీవల ఓ సర్వేసంస్థ పేర్కొంది. దీంతో ఎలాగైనా వలస ఓటర్లను రాకుండా చేయాలని వైసీపీ కుయుక్తులు పన్నుతోంది. వారి బంధువుల ఇళ్లవద్దకు వెళ్లి ఓటుకు కావాలంటే డబ్బు ఇస్తాంకానీ వారిని ఇక్కడికి ఓటింగ్‌కు రాకుండా చూడాలంటూ చెబుతుండడం విశేషం. దీనినిబట్టి వలస ఓటర్లు అంటే అధికార వైసీపీ వారికి ఎంత భయం ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఓటును కీలకంగా భావించి వలస ఓటర్లపై గురిపెట్టారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఇంటింటి ప్రచారంలో నాయకులు

హిందూపురం అర్బన్, మే 4: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పరిగి మండలం నాయకులు మాజీ జడ్పీటీసీ దనాపురం సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. వారు శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిగి మండల పరిధిలోని విట్టాపల్లి, పెడేటి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతందని వివరించారు. కాబట్టి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం రాష్ట్ర నాయకుడు హనుమయ్య, విట్టాపల్లి సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ ఖాన్, అంజనేయులు, సంజీవప్ప, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుందని మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి పేర్కొన్నారు. మండలంలోని నాగలూరు, అమ్మవారిపల్లిలో టీడీపీ నాయకులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరు గుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రా లు పంచుతూ వాటి ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రవీంద్రరెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండల కేంద్రంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు ప్రతి ఇంటింటా తిరిగి టీడీపీ ఎన్నికల మేనిఫేస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నా రు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమార్‌స్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుడిబండ: జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి అసెంబ్లీ అభ్యర్థి ఎంఎస్ రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడిబండలో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు విడుదల చేసిన సూపర్‌సిక్స్ పథకాలు, మ్యానిఫేస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గేష్, శివకుమార్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: హిందూపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుకు మద్దతుగా టీడీపీ రాష్ట్ర కురుబ సంఘం డైరెక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని గుడ్డగుర్కి, వన్నప్పపాళ్యం, దాసప్పపాళ్యం తదితర గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. నాయకులు చెరుకురి శివ, లక్ష్మీనారాయణ, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : పోలింగ్ సమయంలో ఓటు ఎలా వేయాలన్న దానిపై ఈవీఎం నమూనాలతో ప్రజలకు టీడీపీ మైనార్టీ నాయకుడు దాదు అవగాహన కల్పించారు. వారు శనివారం పట్టణంలోని బోయగేరి, దర్గాపేట తదితర ప్రాంతాల్లో టీడీపీ స్థానిక శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం నమూనాను ఓటరుకు చూపించి బటన్ ఎలా నొక్కాలి అనే విషయంపై, మేనిఫెస్టోపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ తరఫున వలంటీర్ల ప్రచారం



కరపత్రాలను ఇచ్చి వెళ్తున్న వలంటీర్లు శ్రీకాంత్, రాధమ్మ కళ్యాణి

ధర్మవరం రూరల్, మే4: మండలంలోని మల్లాకాల్వ గ్రామంలో వలంటీర్లు శ్రీకాంత్, రాధమ్మ, కళ్యాణిలు శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఓటు వేయాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఓటువేయాలని కరపత్రాలను ఇంటింటికీ ఇచ్చి ఓటు వేస్తే మీకు పథకాలు వస్తాయంటూ ప్రజలకు ప్రచారం చేశారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసినా గ్రామాల్లో అవేమీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వలంటీర్లుకు సరైన విధివిధానాలు మండల, గ్రామపంచాయితీ అధికారులు వారికి తెలియజేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వలంటీర్లు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంకా కొంతమంది అధికారులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ తమ స్వామి భక్తిని చాటుకున్నారు.

ఉపాధ్యాయుడి మృతి

కేసు నమోదుచేసిన పోలీసులు

తాడిపత్రిటౌన్, మే 4: పట్టణ సమీపంలోని కడప రోడ్డులో శనివారం ఉదయం ఉపాధ్యాయుడు రామాంజనేయులు (55) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. జిల్లాలోని ఉరవకొండ పట్టణంలోని రంగావీధికి చెందిన రామాంజనేయులు బొమ్మనహాల్ మండలం చంద్రగిరి గ్రామంలోని పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నాడు. ఎన్నికల విధుల నిమిత్తం శిక్షణకు గాను 3వ తేదీన తాడిపత్రికి వచ్చాడు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఆయన రోడ్డుపక్కన శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు ఆరాతీసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. రామాంజనేయులుకు భార్య మాలతితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.